ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

RNI TGTEL/25/A5065

# vaartha sandhya వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు

NO SMOKING ALCOHOL
SAY NO TO DRUGS

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 55 శుక్రవారం 06 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-
Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 55 Friday 06 - 02 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# ప్రాణాలకు తెగించి తెలంగాణ ప్రకటించారు

- సోనియా గాంధీ త్యాగంతోనే తెలంగాణ
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రాణాలకు తెగించి రాష్ట్రాన్ని ప్రకటించారు
- మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులతో జరిగిన సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు
- రాజకీయాల్లో గెలుపునకు డబ్బు కొలమానం కాదని, ప్రజల నమ్మకమే నిజమైన పెట్టుబడి
- రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని సూచన
- తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో సోనియా గాంధీ చూపిన తెగువను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు
- పార్లమెంటులో పెప్పర్ స్ప్రే దాడులను సైతం లెక్కచేయకుండా పొన్నం ప్రభాకర్ వంటి నేతలు పోరాట చేసిన పోరాటం చేశారు
- టికెట్ దక్కని నాయకులను కలుపుకొని పోవాల్సిన బాధ్యత అభ్యర్థులదేనని స్పష్టం



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 05 :** సోనియా గాంధీ ఇచ్చిన మాట నిలబెట్టు కున్నారని, ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రాణాలకు తెగించి తెలంగాణ ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.గురువారం కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, 2004లో ఇదే జిల్లాలో సోనియా గాంధీ తెలంగాణ ప్రకటన చేశారని, ఆ మాటను నిలబెట్టుకునే క్రమంలో పార్టీని సైతం పణంగా పెట్టారని గుర్తుచేశారు. మరోవైపు, జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల తో జరిగిన సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో గెలుపునకు డబ్బు కొలమానం కాదని, ప్రజల నమ్మకమే నిజమైన పెట్టుబడి అని దిశానిర్దేశం - మిగతా 2 లో

# మరో రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు



- బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు
- అప్పుడు మిగిలిన పనులు చేసుకుందాం
- గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు
- మనల్ని బాగా చూసుకునే వారికి ఓటు వేయాలని పిలుపు
- ధైర్యం ఉంటే అభివృద్ధిలో కేసీఆర్‌తో పోటీ పడాలని ముఖ్యమంత్రికి సవాల్

**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 05 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో రెండేళ్లలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏమీ చేయరని విమర్శించారు. గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు మాట్లాడుతూ, మనల్ని బాగా - మిగతా 2 లో



2 లో

## తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఏపీలో ఎన్నో విమానాశ్రయాలు ఉన్నా తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్న
- కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శ
- దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే వెళుతున్నాయని ఆగ్రహం

## అమెరికా గుండెల్లో 'ఇరాన్' రైళ్లు

- భూగర్భంలో భారీ క్షిపణి కేంద్రం సిద్ధం
- రక్షణ నుంచి దాడుల శైలికి ఇరాన్ సైనిక సిద్ధాంతం మార్పు
- అండర్ గ్రౌండ్ మిస్సైల్ బేస్‌ను సందర్శించిన ఇరాన్ సైనిక దళాల అధిపతి
- శత్రువులపై విరుచుకుపడేలా క్షిపణి సామర్థ్యం పెంపు
- అమెరికా తప్పు చేస్తే వారి స్థావరాలకు రక్షణ ఉండదని హెచ్చరిక



2 లో



2 లో

## బొగ్గు గనిలో పేలుడు...

- 10 మంది మృత్యువాత
- మేఘాలయలోని బొగ్గు గనిలో భారీ పేలుడు
- ఘటనలో 10 మంది కార్మికులు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో ఎక్కువ మంది అసోం వాసులుగా అనుమానం
- ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

# వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోంది

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- నిరసనల మధ్య... రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం... విపక్షాల వాకౌట్
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని ప్రసంగం
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకంపై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- ప్రధాని మాట్లాడుతుండగా నినాదాలు.. సభ నుంచి వాకౌట్ చేసిన విపక్ష సభ్యులు
- వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- భారత్‌తో వ్యాపారానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వ్యాఖ్య



**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 05 :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇస్తుండగా, విపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అడ్డంకి కలిగించి, చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సభ నుంచి వాకౌట్ చేశారు.మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవణే తన ఆత్మకథలో రాసిన కొన్ని కీలక అంశాలపై లోక్‌సభలో చర్చకు అనుమతించకపోవడమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 2020లో చైనాతో సరిహద్దు ఘర్షణల సమయంలో - మిగతా 2 లో

# సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు
- గత వైసీపీ ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆరోపణలు
- తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు పామాయిల్, రసాయనాలు వాడారని వ్యాఖ్య
- అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి కూడా లక్ష కల్తీ లడ్డూలు పంపారని ఆరోపణ
- ఈ వ్యవహారంలో ఎక్కడా సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదని, వాస్తవాలు బయటపెడతామని స్పష్టీకరణ



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 05 :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఎంతో పవి త్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం జరిగిందని - మిగతా 2 లో

# మీరు చేసింది మహా పాపం

- ఏక సభ్య కమిషన్ వేస్తున్నాం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- తిరుమల నెయ్యి కల్తీపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజం
- గత వైసీపీ ప్రభుత్వం 2022 నివేదికను ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టిందని ఆరోపణ
- సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన మొదలుపెట్టానని వెల్లడి
- పామాయిల్, కెమికల్స్, జంతువుల కొవ్వుతో నెయ్యి తయారు చేశారని ఆగ్రహం
- దేవుడితో పెట్టుకోవద్దని, భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దని తీవ్ర హెచ్చరిక



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 05 :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది క్షమించరాని మహా పాపం అని ఆయన అభివర్ణించారు. దేవుడితో చెలగాటమాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను, అపవిత్ర ఘటనలను గుర్తుచేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. - మిగతా 2 లో

# తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు

- ఢిల్లీలో వైసీపీ ఎంపీల మీడియా సమావేశం
- లడ్డూ నెయ్యిలో కొవ్వు ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్న వైసీపీ ఎంపీలు
- సీబీఐ, సిట్ నివేదికల్లో క్లీన్ చిట్ వచ్చిందని వెల్లడి
- సత్యశోధన పరీక్షకు సిద్ధమన్న టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- రాజకీయ లబ్ధి కోసమే కూటమి విషప్రచారం చేస్తోందని ఆరోపణ
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ కుట్రలన్న వైసీపీ



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 05 :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలను వైసీపీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, సీబీఐ - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఆత్మనిర్భరత బాటలో...



ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ ప్రకటించిన కొత్త బడ్జెట్ ఎలాంటి మెరుపులు, ఆశ్చర్యపరిచే ప్రకటనలు లేకుండా సాగిపోయింది. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని జనాకర్షణ ప్రకటనలుండవచ్చునన్న ఊహాగానాలకు ప్రారంభంలోనే నిర్మలమ్మ తెరదించారు. "జనాకర్షణ కాదు... జన సంక్షేమమే ప్రధానం" అని తేల్చి చెప్పారు. నరేంద్ర మోదీ సారథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బడ్జెట్ దిశ మారింది. భారీ తాయిలాలతో ప్రజలను బుజ్జగించే ధోరణులకు చరమగీతం పాడింది. దీర్ఘకాలిక వృద్ధికి పెద్దపీట వేయడం, 2047 నాటికి 'వికసిత్ భారత్'గా దేశాన్ని తీర్చి దిద్దడానికే పెద్దపీట వేసింది. ఈ ప్రయాణంలో మరో ముందడుగు 202627 సంవత్సరానికి నిర్మల ప్రకటించిన ఈ బడ్జెట్ అని చెప్పవచ్చు. గత ఏడాది ద్వితీయార్ధంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన భారీ సుంకాల ప్రభావంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం భారీగా దెబ్బతింది. ఉపాధి రంగంలో సింహభాగం ఈ రంగాలదే. అందుకే ఈ రంగాలను ఆదుకునేందుకు రూ.10,000 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం అభిలషణీయమైన చర్య. దీనివల్ల ఎంఎస్ఎంఈ రంగంలో నిధుల కొరత తీరుతుంది. అలాగే గత కొన్నేళ్లుగా పలు కీలక రంగాలు సెమీ కండక్టర్ చిప్‌ల కొరతతో అల్లాడిపోతున్నాయి. దేశీయంగా వాటి ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ఈ బడ్జెట్‌లో ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0 ప్రకటించి కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న సెమీ కండక్టర్ మిషన్ 1.0 కేటాయింపులతో పోల్చితే సుమారుగా రెట్టింపు చేశారు. దీనితో పాటుగా రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, టెక్స్‌టైల్స్, బయోఫార్మా, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు, యంత్రపరికరాలు, రసాయనాల రంగాలను వ్యూహాత్మక ప్రాధాన్యతా రంగాలుగా ప్రకటించడం వల్ల వాటికి ప్రభుత్వం నుంచి మరింత అధికంగా మద్దతు లభిస్తుంది. బయోఫార్మా రంగం కోసం రూ.10,000 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం ఆ రంగానికి ఎంతో ఉత్తేజం కల్పిస్తుంది. దేశంలో మధుమేహం, క్యాన్సర్ వంటి జీవనశైలి వ్యాధులు ప్రబలిపోతున్న దశలో ఇది మంచి అడుగు. ఆ వ్యాధులను ఎదుర్కొనేందుకు అవసరమైన ఔషధాల తయారీకి ఇది మద్దతు ఇస్తుంది. అంతే కాదు...పలు కీలక రంగాలకు అరుదైన ఖనిజాల లభ్యతను పెంచేందుకు దేశంలో ఏర్పాటు చేయనున్న నాలుగు రేర్ ఎర్త్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్‌కు కూడా స్థానం లభించడం హర్షదాయకం.అలాగే దేశంలో ఇటీవల కాలంలో డేటా సెంటర్ల విస్తరణ జోరుగా సాగుతోంది. గతంలో ఐటీ తరహాలో ఉపాధికల్పనకు ఇప్పుడు డేటా సెంటర్లు కీలకంగా మారాయని నిపుణులంటున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు 2047 వరకు పన్ను విరామం ఇవ్వడం ఆ రంగాన్ని ఎంతో ఉత్తేజితం చేస్తుంది. ఇందులో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉన్నది. ఆంధ్రప్రదేశ్ కూడా ఇప్పుడు ఆ పోటీలో ప్రవేశించింది. ఆ రకంగా ఈ చర్య రెండు రాష్ట్రాలకు ఎంతో సహాయకారి అవుతుంది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ కేటాయింపులు సైతం పెంచుకుంటూ వస్తోంది. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ మూలధన వ్యయాలను రూ.12.22 లక్షల కోట్లకు, అంటే గత బడ్జెట్‌తో పోల్చితే 12.5శాతం పైబడి పెంచడం కూడా ఆర్థిక రంగాన్ని ఉత్తేజితం చేస్తుంది. కీలక రంగాలకు అవసరమైన నిధులు అందుబాటులోకి వచ్చి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇందులో భాగంగానే కొత్త బడ్జెట్‌లో ఏడు హైస్పీడ్ కారిడార్లను ప్రతిపాదించగా వాటిలో మూడు హైదరాబాద్‌తో అనుసంధానమైనవి కావడం కూడా తెలుగు రాష్ట్రాలకు ఆనందం కలిగించే అంశం. దేశాన్ని విదేశీ మూకల నుంచి కాపాడాలంటే రక్షణ రంగాన్ని పటిష్ఠం చేయడం ఎంతో అవసరం. ఇటీవల కాలంలో పొరుగుదేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనా నుంచి ముప్పు పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో రక్షణ బడ్జెట్‌ను ఏకంగా జీడీపీలో 2 శాతానికి పెంచడం సాయుధ దళాల పోరాట సంసిద్ధతను, సామర్థ్యాన్ని మరింతగా పెంచడానికి దోహదపడే చర్య. మొత్తం మీద ఈ బడ్జెట్ అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకుంటూ విభిన్న కోణాల నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తూ దేశాన్ని ఆత్మనిర్భరత బాటలో నడుపుతుందని ఆశించవచ్చు.

# మీరు చేసింది మహా పాపం...

**మొదటిపేజీ తరువాయి** – ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల కీలక సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.

**భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు**

కరడుగట్టిన నేరస్థులు అసత్యాన్ని ఎలా నమ్మిస్తారో, అలాగే గత పాలకులు ఇప్పుడు మాట్లాడుతున్నారని చంద్రబాబు అన్నారు. "సీబీఐ నివేదికలో కల్తీ లేదని ఎక్కడా చెప్పలేదు. అయినా, కల్తీ జరగలేదని ఎదురుదాడి చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. రాష్ట్రంలోని భక్తులందరికీ ఒక సామాన్య భక్తుడిగా విజ్ఞప్తి చేస్తున్నా. దేవునికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాలి. ఈ దోషులను కఠినంగా శిక్షిస్తాం. ఏకసభ్య కమిషన్ వేసి సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇప్పటివరకు ఉన్న నివేదికలన్నీ ఆ కమిషన్ ముందు ఉంచుతాం. అవసరమైతే కోర్టులోనూ అదనపు సమాచారం సమర్పిస్తాం. ఇది దేవుడిచ్చిన బాధ్యత, దైవ కార్యం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**దేవుడితో పెట్టుకోవద్దు.. ఇది దుర్మార్గమైన అపచారం**

వైసీపీ నేతలకు దేవుడిపై విశ్వాసం లేకపోవచ్చని, కానీ విశ్వాసం ఉన్న కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే హక్కు వారికి లేదని చంద్రబాబు హెచ్చరించారు. "అంతర్వేదిలో రథం తగలబడితే కందిరీగలు కొరికాయని, ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు. విశ్వాసం లేకపోతే దేవుడి జోలికి రావొద్దు. దేవుడి పవిత్రతను దెబ్బతీయడం దుర్మార్గం. చరిత్రలో ఇప్పటివరకు శ్రీ వెంకటేశ్వర స్వామి జోలికి ఎవరూ రాలేదు. బ్రిటిష్ వాళ్లు కూడా



స్వామివారి సంప్రదాయాలను గౌరవించి, మరింత అభివృద్ధి చేశారు. అలాంటిది మీరు చేసిన ఈ పని దుర్మార్గమైన అపచారం" అని ఆయన తీవ్రంగా ఖండించారు.

**సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన**

తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి ప్రాధాన్యతగా పరిపాలన, దైవ కార్యాల ప్రక్షాళనపై దృష్టి సారించానని చంద్రబాబు వివరించారు. "ముఖ్యమంత్రిగా నా కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించడం నా మొదటి సంతకం. మానవ సేవ కన్నా ముందు మాధవ సేవ ముఖ్యమని భావించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తిరుమల ప్రక్షాళన కోసం టీటీడీ ఈఓగా శామలరావును నియమిస్తూ రెండో సంతకం చేశాను. ఈ రెండు పనులు పూర్తి చేశాకే ఇతర కార్యక్రమాలు చేపట్టాను" అని ఆయన తెలిపారు. అనంతరం తిరుమలలో పరిస్థితులను సమీక్షించి, కల్తీ జరుగుతోందన్న అనుమానంతో నెయ్యి శాంపిళ్లను నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ)కు పంపించామని, ఆ నివేదికలోనే కల్తీ వాస్తవాలు బయటపడ్డాయని స్పష్టం చేశారు.

**2022లోనే నివేదిక.. అయినా తొక్కిపెట్టారు**

ఈ కల్తీ వ్యవహారం కొత్తగా బయటపడింది కాదని, 2022లోనే గత వైసీపీ ప్రభుత్వానికి దీనిపై నివేదిక అందిందని చంద్రబాబు సంచలన విషయాలు వెల్లడించారు."2022లో సీఎఫ్టీఆర్ఐ ఇచ్చిన నివేదికలో నెయ్యి కల్తీ జరుగుతోందని చాలా స్పష్టంగా ఉంది. కానీ, ఆ నివేదికను వాళ్లు ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టారు. యథేచ్ఛగా కల్తీ నెయ్యి సరఫరాను కొనసాగించారు" అని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఏర్పాటైన సిట్ విచారణలో మరింత భయంకరమైన నిజాలు బయటపడ్డాయని, నెయ్యి తయారీలో పామాయిల్, ప్రమాదకర రసాయనాలు, చివరికి జంతువుల కొవ్వు (యానిమల్ ఫ్యాట్) కూడా వాడుతున్నట్లు తేలిందని ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**గత ఐదేళ్లలో హిందూమతంపై దాడి**

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై దాడులు పరాకాష్టకు చేరాయని చంద్రబాబు విమర్శించారు. "ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో తిరుమల రెండు కొండలే, ఏడు కొండలు కాదని మాట్లాడినప్పుడు మేం వ్యతిరేకించాం. విజయనగరంలో రాముడి విగ్రహం తల నరికివేస్తే, అక్కడికి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలనుకున్న నాపైనే కేసు పెట్టారు. అంతర్వేదిలో రథం తగలబడితే ఎలుకలు కొరికాయని చెప్పారు. ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు" అని ఆయన మండిపడ్డారు.

# సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు



**మొదటిపేజీ తరువాయి** – ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, ఇందులో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదని ఆయన గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, భగవంతుడి ముందు వారు మోకరిల్లే వరకు తమ యుద్ధం ఆగదని హెచ్చరించారు.నెయ్యి పేరుతో పామాయిల్, ప్రమాదకరమైన రసాయనాలు వాడి భక్తుల మనోభావాలను, ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై మాట్లాడేటప్పుడు తాము అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల సమావేశం అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడారు.పవన్ కల్యాణ్ తన ఆరోపణలకు సంబంధించిన గణాంకాలను కూడా మీడియా ముందుంచారు. "తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఓ నిర్దిష్ట కంపెనీ 59.70 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసినట్లు అధికారికంగా లెక్కలు చూపింది. కానీ, మా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం, అదే కంపెనీ 58 లక్షల కిలోలకు పైగా పామాయిల్, దానికి సంబంధించిన ప్లాంట్ బేస్డ్ ఉత్పత్తులను కొనుగోలు చేసింది. అంతేకాకుండా, సుమారు 1.70 లక్షల నుంచి 2 లక్షల కిలోల వరకు రసాయనాలను కూడా కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డ్ ఆధారాలున్నాయి. నెయ్యి సరఫరా చేస్తున్నామని చెప్పి, పామాయిల్, రసాయనాలు కొనుగోలు చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ఇది కల్తీ నెయ్యి కాదు, కల్తీ వనస్పతి, కల్తీ పామాయిల్" అని పవన్ వివరించారు. ఈ కుంభకోణం కేవలం తిరుమలతోనే ఆగిపోలేదని, అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి కూడా ఇక్కడి నుంచి పంపిన లక్ష లడ్డూలు సైతం ఈ కల్తీ నెయ్యితో తయారు చేసినవేనని పవన్ ఆరోపించారు. దేశమంతా ఎంతో పవిత్రంగా జరుపుకున్న కార్యక్రమానికి సైతం కల్తీ లడ్డూలు పంపి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన మండిపడ్డారు.గత ప్రభుత్వానికి దేవుడిపై, హిందూ సంప్రదాయాలపై పగ ఉందని, అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని పవన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "వీరికి ఏడుకొండల స్వామిపై ఎందుకో పగ. ఏడు కొండలు ఎందుకు, రెండు చాలు అన్న చరిత్ర వీరిది. వీరు వ్యక్తులపై, ప్రత్యర్థులపై కాదు, ఏకంగా భగవంతుడిపైనే పగబట్టారు. ఈ కుట్ర వెనుక ఉన్న వారి వారసత్వం, వారి పరంపర ఎలాంటిదో ప్రజలు గమనించాలి. అందుకే ఈ అంశాన్ని సరిదిద్ది, వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. "గత ఐదేళ్లలో, అంటే 2019 నుంచి 2024 వరకు, రాష్ట్రంలో వైసీపీ పాలనలో హిందూ ధర్మానికి, దేవాలయాలకు తీరని అపచారాలు జరిగాయి. ఇవి చాలా సున్నితమైన అంశాలు. మత విశ్వాసాలతో ముడిపడి ఉన్న విషయాలపై ఆనాటి ప్రభుత్వ పెద్దలు చూపిన నిర్లక్ష్యం, వారి బాధ్యతారాహిత్యం ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఉదాహరణకు, రామతీర్థంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రమూర్తి విగ్రహ శిరచ్ఛేదనం జరిగితే, దాన్ని ఎవరో ఆకతాయి చేసిన పనిగా తేల్చేశారు. పిఠాపురంలో దేవతా విగ్రహాలకు అశుద్ధం పూస్తే, దానిని ఎవరో పిచ్చోడి చర్యగా చిత్రీకరించి చేతులు దులుపుకున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయంలో వెండి సింహాలు మాయమైతే, 'అవి పోతే ఇంకొకటి కొంటాం, వాటితో ఏమైనా మేడలు, మిద్దెలు కడతామా?' అని అప్పటి మంత్రులు ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడారో ప్రజలు మర్చిపోలేదు. ఇక అంతర్వేదిలో పవిత్రమైన రథం కాలిపోతే, దాన్ని మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పనిగా తేల్చేసి కేసును పక్కన పెట్టేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగినా, ఆనాటి ప్రభుత్వంలో ఒక్కరు కూడా బాధ్యతగా మాట్లాడటం గానీ, కఠిన చర్యలు తీసుకోవడం గానీ చేయలేదు.మేం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇలాంటి పాత విషయాలపై ఆరోపణలు, విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాల్సిన అవసరం మాకేముంటుంది? మా దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి కాబట్టే ఈ విషయాలను ప్రస్తావిస్తున్నాం. జరిగిన వాస్తవాలు మాకు తెలిసి కూడా ప్రజలకు చెప్పకపోతే, భవిష్యత్తులో వారే మమ్మల్ని నిలదీస్తారు, 'మీకు తెలిసినా ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని అడుగుతారు. అందుకే బయటకు వచ్చి మాట్లాడుతున్నాం.గత ఐదేళ్లలో హైందవ సంస్కృతి, మన ధర్మంపై వైసీపీ ప్రభుత్వం తరచుగా దాడులకు, అపవిత్ర కార్యాలకు తెగబడింది. అందుకే దీనిపై మాట్లాడాల్సిన, ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం జరిగిన తప్పులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి, ఎదురు మాపైనే విమర్శలు చేస్తున్నారు. ఒకటే విషయాన్ని స్పష్టంగా చెప్తున్నాను... భగవంతుడి మీద పగ పెట్టుకున్నవాడు ఎవడైనా సరే సర్వనాశనం అయిపోతాడు. చరిత్రలో అలా బతికి బట్ట కట్టిన దాఖలాలు కూడా లేవు. ఈ విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి" అని పవన్ తీవ్ర హెచ్చరికలు చేశారు.

# తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి** – నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని వారు తెలిపారు. ఉండవల్లిలో కూటమి నేతలు చేసిన విమర్శలకు కౌంటర్‌గా గురువారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రయోజనాల కోసం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు.లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారంటూ వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, అందులో నిజం లేదని తేల్చిందని వైసీపీ నేతలు గుర్తుచేశారు. ఆ తర్వాత సీబీఐ కూడా అదే నిర్ధారణకు వచ్చిందని పేర్కొన్నారు. అయినా, కూటమి ప్రభుత్వం కావాలనే విషప్రచారం చేస్తూ, ఫ్లెక్సీలు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వారు ఆరోపించారు.

**ఏ ప్రమాణానికైనా సిద్ధం: వైవీ సుబ్బారెడ్డి**

టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తనపై చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని, ఎలాంటి పరీక్షకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. "నేను టీటీడీ ఛైర్మన్‌గా ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే పనులు చేయలేదు. స్వామివారి సాక్షిగా ఏ ప్రమాణం చేయడానికైనా నేను రెడీ. అవసరమైతే దేవుడి ముందు సత్యశోధన (పాలిగ్రాఫ్) పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నాను" అని ఆయన స్పష్టం చేశారు. నెయ్యి సరఫరాను పెంచేందుకే నిబంధనలు సవరించామని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని వివరించారు. వివాదాస్పదమైన 'బోలె బాబా' కంపెనీ సరఫరా నిబంధనల సవరణకు ముందే జరిగిందని, అది కూడా టీడీపీ హయాంలోనే మొదలైందని గుర్తుచేశారు. తనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న చిన్న అప్పన్న తన పీఏ కాదని, కేవలం ఏపీ భవన్‌లో లైజన్ ఆఫీసర్ మాత్రమేనని ఆయన తేల్చిచెప్పారు. వైసీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం పవిత్రమైన వెంకటేశ్వర స్వామిని కూడా వాడుకుంటున్నారని, ఇది ఘోరమైన తప్పని విమర్శించారు. "సిట్ నివేదిక చంద్రబాబు ఆరోపణలు అబద్ధమని తేల్చింది. దాన్ని జీర్ణించుకోలేక ఇప్పుడు మళ్లీ కొత్త కమిటీలు వేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి గారు వెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడు. అలాంటి వ్యక్తిపై ఇలాంటి నీచమైన ఆరోపణలు చేయడం దుర్మార్గం" అని మిథున్ రెడ్డి అన్నారు.

# వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోంది

**మొదటిపేజీ తరువాయి** – రాజకీయ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందలేదని నరవణే పేర్కొన్నారని, ఆ భాగాలను చదివి వినిపించేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే అంశంపై గత మూడు రోజులుగా లోక్‌సభ దద్దరిల్లుతోంది. బుధవారం లోక్‌సభలో మహిళా ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలపడంతో సభ వాయిదా పడి, ప్రధాని ప్రసంగం నిలిచిపోయింది.ఇవాళ రాజ్యసభలోనూ విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యసభలో విపక్షాల నినాదాలు, అల్లరి మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'వికసిత భారత్' నిర్మాణంలో దేశం సరైన దిశలో వేగంగా పయనిస్తోందని అన్నారు. "గత కొన్ని సంవత్సరాలు దేశ వేగవంతమైన అభివృద్ధికి సాక్ష్యంగా నిలిచాయి. ప్రతి రంగంలోనూ ఇది మార్పుల యుగం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్యంలోకి వెళుతుంటే, యువశక్తితో ఉరకలేస్తున్న భారత్ ప్రపంచానికి కొత్త ఆశను అందిస్తోందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు.అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ పెరిగిందని, ఇటీవలే 9 కీలక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. గత కొన్నేళ్లుగా చేపట్టిన సంస్కరణల కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్‌తో వ్యాపారం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు విపక్ష సభ్యులు 'విపక్ష నేతను మాట్లాడనివ్వండి', 'నియంతృత్వం నశించాలి' వంటి నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సరదాగా వ్యాఖ్యలు చేశారు. "ఖర్గే జీ వయసు, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని ఆయన కూర్చునే నినాదాలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి" అని ప్యానెల్ స్పీకర్ ను కోరుతున్నట్లు చమత్కరించారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి నిష్క్రమించాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రభుత్వం కాలరాస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా, అభివృద్ధి అజెండానే తమకు ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# ప్రాణాలకు తెగించి తెలంగాణ ప్రకటించారు

**మొదటిపేజీ తరువాయి** – చేశారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని సూచించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన విధ్వంసాన్ని, కాంగ్రెస్ తెచ్చిన మార్పును ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో సోనియా గాంధీ చూపిన తెగువను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ నష్టపోతుందని తెలిసినా, కేంద్రంలో అధికారం కోల్పోయే ప్రమాదం ఉన్నా, ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రాన్ని ప్రకటించారని కొనియాడారు. ఆనాడు పెట్టుబడిదారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు వచ్చినా ఆమె చలించలేదని అన్నారు. పార్లమెంటులో పెప్పర్ స్ప్రే దాడులను సైతం లెక్కచేయకుండా పొన్నం ప్రభాకర్ వంటి నేతలు చేసిన పోరాటాన్ని, వారి త్యాగాలను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు.మున్సిపల్ ఎన్నికల వేళ కార్యకర్తలకు, అభ్యర్థులకు సీఎం నూతనోత్సాహాన్ని నింపారు. టికెట్ కోసం తీవ్ర పోటీ ఉన్నప్పటికీ, పార్టీ అధిష్టానం నమ్మి ఇచ్చిన



అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ దక్కని నాయకులను కలుపుకొని పోవాల్సిన బాధ్యత అభ్యర్థులదేనని స్పష్టం చేశారు. ఒక్క ఓటు కూడా ఫలితాన్ని తారుమారు చేస్తుందని, అందుకే అలసత్వం వద్దని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఇవ్వని రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలే కాంగ్రెస్ విజయానికి నాంది అని తెలిపారు. మనం చేసిన పనులే ప్రజలకు చెప్పాలని, అబద్ధాలు ఆడాల్సిన అవసరం మనకు లేదని హితవు పలికారు.గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలన కేవలం ఆస్తులు కూడబెట్టుకోవడానికే పరిమితమైందని రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు గానీ, దళితులకు మూడు ఎకరాల భూమి గానీ ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిన చరిత్ర కాంగ్రెస్‌దని గుర్తుచేశారు. ఉచిత విద్యుత్ పథకంపై పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీదేనని, రైతులపై కేసులు ఎత్తివేసి, విద్యుత్ బకాయిలు రద్దు చేసిన ఘనత తమకే దక్కుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక ప్రతిపక్షం విషం చిమ్ముతోందని మండిపడ్డారు.

# బొగ్గు గనిలో పేలుడు...

**మొదటిపేజీ తరువాయి** – మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్టె ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, కనీసం 10 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది.వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# అమెరికా గుండెల్లో 'ఇరాన్' రైళ్లు

**మొదటిపేజీ తరువాయి** – పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ ఇరాన్ తన సైనిక పరాక్రమాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. అమెరికాతో గరిష్ఠ స్థాయి ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఒక అత్యాధునిక 'అండర్ గ్రౌండ్ మిస్సైల్ బేస్'ను ఆవిష్కరించింది. ఇరాన్ సైనిక దళాల అధిపతి అబ్దోల్రహీమ్ మౌసవి బుధవారం ఈ కేంద్రాన్ని సందర్శించి, క్షిపణి యూనిట్ల సన్నద్ధతను స్వయంగా పరిశీలించారు.ముఖ్యంగా, ఇరాన్ తన సైనిక సిద్ధాంతాన్ని రక్షణ నుంచి దాడుల శైలికి మార్చినట్లు మౌసవి ప్రకటించడం అంతర్జాతీయంగా సంచలనం రేపుతోంది. గత ఏడాది ఇజ్రాయెల్‌తో జరిగిన 12 రోజుల యుద్ధం తర్వాత, కేవలం ఎదురుదాడి చేయడమే కాకుండా.. శత్రువుపై మెరుపు వేగంతో విరుచుకుపడేలా తమ క్షిపణి సామర్థ్యాన్ని పెంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికా గనుక ఏ చిన్న తప్పు చేసినా, ఆ ప్రాంతంలో ఉన్న అమెరికా పౌరులకు కానీ, వారి స్థావరాలకు కానీ రక్షణ ఉండదని ఘాటుగా హెచ్చరించారు.ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తన విమాన వాహక నౌకలను మోహరించడంతో పాటు, ఇరాన్ డ్రోన్లను కూల్చివేస్తూ ఒత్తిడి పెంచుతోంది. మరోవైపు, ఒమన్‌లో ఇరు దేశాల మధ్య రహస్య చర్చలు జరగనున్నాయన్న వార్తల నడుమ.. ఇరాన్ తన భూగర్భ క్షిపణి నగరాన్ని బయటపెట్టడం ద్వారా వాషింగ్టన్‌కు ఒక బలమైన సంకేతం పంపింది.

# మరో రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు

**మొదటిపేజీ తరువాయి** – చూసుకునే వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.ఒకప్పుడు పందులతో ఉన్న గజ్వేల్ ఆసుపత్రి కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది కానీ వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు కానీ బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందని అన్నారు. అప్పుడు బంగారం ఆశపెట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడటం లేదని విమర్శించారు.కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై తిట్ల వర్షం కురిపించడం తప్ప రేవంత్ రెడ్డికి తెలిసిందేమీ లేదని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత రైతు బంధు ఇస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ ఈ నెల 11 లోపు ఇవ్వకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే అభివృద్ధి విషయంలో కేసీఆర్‌తో పోటీ పడాలని సవాల్ చేశారు.ం

## తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలి

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణను రక్షించుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇన్నాళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని, ఏపీలో విమానాశ్రయాలు ఉన్నాయి కానీ తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, తెలంగాణ నుంచే డబ్బులు వెళుతున్నాయని ఆరోపించారు. తెలంగాణను కాపాడుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు ఉన్న విషయం తెలిసిందే.

# నగల చోరీ కేసులో వేగవంతంగా దర్యాప్తు

## నిందితుల అరెస్టు రిమాండ్

## మెట్ పల్లి పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ

**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 5 (వార్త సంధ్య):** మెట్ పల్లి పట్టణం చాకిరేవు వద్ద తల్లి కొడుకుల పై దాడి చేసి దాడి చేసి వన్నెల గంగు అనే మహిళా మెడలో నుండి 3 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లిన కేసులో నిందితులను పట్టుకొని అరెస్ట్ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలోనే సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితులు ఎక్కడ కూడా ఆనవాళ్లు లేకుండా చోరీ పాల్పడిన ఈ ఘటనను సంబంధించిన ఈ కేసులో మెట్ పల్లి పోలీసులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించి వేగవంతంగా నిందితులను పట్టుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మెట్ పల్లి డిఎస్పీ కార్యాలయంలో మెట్ పల్లి డి.ఎస్.పి రాములు తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి అశోక్ కుమార్ కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మెట్ పల్లి పట్టణంలో గత జనవరి నెలలో వరుసగా ఆరు దొంగతనాలు జరిగినాయని రాములు తెలిపారు. ఈ వరుస ఘటనలకు సంబంధించి జిల్లా పోలీసు యంత్రాంగం సూచనల మేరకు మెట్పల్లి డీఎస్పీ రాములు ఆధ్వర్యంలో మెట్ పల్లి సీఐ అనిల్ కుమార్, ఎస్ఐలు కిరణ్ కుమార్, అనిల్, నవీన్ లతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. ప్రత్యేక బృందాలు మెట్ పల్లి, నిజామాబాద్ ఇతర ప్రాంతాలు తిరిగి, సీసీటీవీ ఫుటేజ్, డాగ్ స్క్వాడ్ ఆధారంగా విచారణ కొనసాగించి నిందితులకు సంబంధించి సమాచారం సేకరించినట్లు పేర్కొన్నారు. విచారణలో



భాగంగా మంగళవారం నాడు మెట్ పల్లి కొత్త బస్టాండ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో పండుగ రమేశ్, పల్లెపు రమేశ్ లను సీఐ, సిబ్బంది కలిసి పట్టుకున్నారని ఎస్పి తెలిపారు. వారి వద్ద నుంచి బాధితురాలు వన్నెల గంగు వద్ద దొంగలించిన 3.5 తులాల బంగారు పుస్తెల తాడు, ఒక ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల ఇచ్చిన సమాచారం మేరకు మిగతా నిందితులు గుంజే గంగాధర్, ఒర్సు గంగమణిలను కూడా అరెస్ట్ చేయగా,గంగాధర్ వద్ద నుంచి 2 తులాల బంగారు పుస్తెలతాడు, 1 తులం బంగారు చైన్,గంగమణి వద్ద నుంచి 2 తులాల బంగారు నెక్లెస్, 18 తులాల వెండి పట్టా గొలుసులు, నేరాల్లో పాల్గొన్న గైని కిరణ్ వద్ద నుంచి 11 తులాల వెండి పట్టా గొలుసులు,పెద్దూరు మల్లేశ్వరి వద్ద నుంచి 3 తులాల వెండి బ్రేస్‌లెట్,దొంగతనపు సొత్తు కొనుగోలు చేసిన ఇందూరి రాకేష్ వద్ద నుంచి 3 తులాల బంగారు నెక్లెస్,1తులం గోల్డ్ చైన్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మొత్తంగా 7 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు, 32 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని వెల్లడించారు. దొంగలను చాకచక్యంగా, వేగవంతంగా సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకున్న ఈ కేసులో మెట్ పల్లి డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్, ఎస్ఐలు కిరణ్ కుమార్, అనిల్, నవీన్ లను సిబ్బందిని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# రెవెన్యూ మ్యుటేషన్ల అర్జీలను క్షేత్రస్థాయిలో వివరణాత్మకంగా పరిష్కరించాలి..

## రీ సర్వే కార్యక్రమంలో జాయింట్ ఎల్పీఎంలు తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 05 ( వార్త సంధ్య ) –** : భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయడమే లక్ష్యంగా రెవెన్యూ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరిగింది. రెవెన్యూ మ్యుటేషన్ల అర్జీలను క్షేత్రస్థాయిలో వివరణాత్మకంగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి లోని పీపీఆర్ కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని గ్రామాల వీఆర్వోలు గ్రామ సర్వేయర్లు అన్ని మండలాల తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్ లకు భూముల మ్యుటేషన్ల పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించడం, మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేయడం మరియు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మ్యుటేషన్‌కు సంబంధించిన నిబంధనలు, విధానాలు, కాలపరిమితులపై అధికారులకు సమగ్ర అవగాహన, ఆన్‌లైన్ మ్యుటేషన్ సిస్టమ్ (వెబ్ లాండ్) వినియోగంలో సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు భూ రికార్డుల ధృవీకరణలో ఖచ్చితత్వాన్ని మెరుగుపరచే అంశాలపై రెవెన్యూ సిబ్బంది ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. పి జి ఆర్ ఎస్ ద్వారా ప్రజలు సమర్పించే మ్యుటేషన్ల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జిదారులతో ఫోటో తీసుకుని పక్కాగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. గ్రామాల వారిగా మ్యుటేషన్ల కు సంబంధించి రిజిస్టర్ లను నిర్వహించాలని మ్యుటేషన్ల ను తిరస్కరిస్తే ఎందుకు తిరస్కరించామో స్పష్టమైన కారణాలతో



స్పీకింగ్ ఆర్డర్ ఇవ్వాలని, తిరస్కరణకు సంబంధించిన వివరాలను రిజిస్టర్లో మరియు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. మ్యుటేషన్లను ఆమోదిస్తే అర్జిదారుల చట్టపరమైన వారసుల వివరాలను, అమ్మకపు పత్రాలను, కుటుంబ వివరాలను పక్కగా చూసి సరిదిద్దాలన్నారు. మ్యుటేషన్ల తిరస్కరణ మరియు ఆమోదాలకు సంబంధించి అక్రమ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ పై మాట్లాడుతూ పాసు పుస్తకాలలో తప్పులు ఉంటే నిర్ణీత కాల వ్యవధిలో తప్పులు సరిచేసి నూతన పట్టాదారు పాస్ పుస్తకాన్ని అర్జీదారులకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. మార్చి మరియు ఏప్రిల్ నెలలలో జరగబోయే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నిర్నీత కాలవ్యవధిలో పూర్తవాలని ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న రీ సర్వేకు సంబంధించి జాయింట్ ఎల్పీఎంలు తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ముటేషన్ల ను నాణ్యతతో పరిష్కరించిన బి కొత్తకోట మండల కేంద్రమైన కురబలకోట గ్రామ వీఆర్వో శ్రీనివాసులును అభినందించారు. ఆగస్టు 15 కు



ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాల జాబితాలో శ్రీనివాసులును చేర్చాలని ఆదేశించారు. ముటేషన్ల కు సంబంధించిన అర్జీలను నాణ్యతతో ఏ విధంగా పరిష్కరించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి మరియు జిల్లా కలెక్టరేట్ లోని ల్యాండ్ సెక్షన్ సూపర్ ఇంటెండెంట్ శ్రావణి రెవెన్యూ సిబ్బందికి వివరించారు. ముటేషన్ల పరిష్కారంలో ఎక్కడ తప్పులు దొర్లుతాయి వాటిని ఏ విధంగా సరిదిద్దాలి వంటి అంశాలను రెవిన్యూ సిబ్బందికి ఆమె వివరించారు. మ్యుటేషన్ ప్రక్రియలో దరఖాస్తు స్వీకరణ నుండి పట్టాదారు పాస్‌బుక్ జారీ వరకు ఉన్న వివిధ దశలను శిక్షణలో సవివరంగా వివరించారు. మీసేవ లేదా గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ, తహశీల్దార్ ద్వారా అడంగల్ పరిశీలన మరియు ఫారం8 నోటీసు జారీ, వీఆర్వోల ద్వారా క్షేత్రస్థాయి విచారణ, సబ్ కలెక్టర్ లేదా ఆర్డిఓ స్థాయిలో పరిశీలన అనంతరం తుది ఆమోదం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ శివ నారాయణ శర్మ, మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి, డిఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి పీలేరు డివిజన్ల ఆర్డీవో శ్రీనివాస్, సర్వే శాఖ ఏడి భరత్ కుమార్, కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది, జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

# గొల్లపెల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్

**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ (వార్త సంధ్య):** భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్ లత మాట్లాడారు. భూ భారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ఓటరు జాబితా సవరణ, ఇరిగేషన్ ట్యాంక్స్ సెన్సెక్స్ సంబంధించిన అంశాలపై చర్చించారు. నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్ఓల పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటరు నమోదు చేయాలని వివరాలు సరిచూడాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. అనర్హుల పేర్లను నిబంధనల మేరకు తొలగించాలని సూచించారు. వయస్సు, చిరునామా వంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఫోటోలు, ఆధార పత్రాలను పరిశీలించాలని తెలిపారు. ఫారమ్ 6, 7, 8లను సక్రమంగా స్వీకరించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో ప్రాసెస్ చేయాలన్నారు. డూప్లికేట్ నమోదులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఓటర్లకు అవసరమైన అవగాహన



కల్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా డేటా అప్‌లోడ్ చేయాలన్నారు. పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అందరు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పట్టణ,గ్రామ, వార్డు స్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువైనదని గుర్తు చేశారు. ఎన్నికల స్వచ్ఛతకు అందరూ సహకరించాలని కోరారు. బాధ్యతాయుతమైన పని విధానం అవసరమన్నారు. లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలని చెప్పారు. నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామాల్లోని చెరువుల యొక్క గణాంకాలు నీటి పారుదల శాఖ తో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ఉండేలా చూడాలని జిపివోలను ఆదేశించారు. ఈ సమావేశంలో గొల్లపెల్లి తహసీల్దార్ అబ్దుల్ మాజిద్, రెవెన్యూ సిబ్బంది, జీపివోలు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు

# 60వ డివిజన్‌లో కాసుల ఉమారాణి ప్రచార హవా

## పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, డిసిసి అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న తదితరులు



**కొత్తగూడెం కార్పొరేషన్, ఫిబ్రవరి 05 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న కాసుల ఉమారాణి ఎన్నికల ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రచారానికి బుధవారం నాడు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు భారీగా హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, భద్రాద్రి జిల్లా డిసిసి అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కోనేరు చిన్ని, జెవిఎస్ చౌదరి, కాసుల వెంకట్, రజాక్, అలాగే భద్రాద్రి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కొరత, మౌలిక వసతుల లేమి, ముఖ్యంగా కిన్నెరసాని పంపు సమస్యలు ప్రజలు ఆయన దృష్టికి



తీసుకువచ్చారు. కార్పొరేషన్ ఎన్నికలు పూర్తయ్యాక కాసుల ఉమారాణి విజయం సాధించిన వెంటనే ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో మాట్లాడి, ఇందిరమ్మ ఇళ్లు రాని అర్హులందరికీ తప్పకుండా ఇళ్లు ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దొంగ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రజలు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని పిలుపునిచ్చారు.

# అనుమానాస్పద స్థితిలో వైద్య విద్యార్థిని మృతి

## విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య విద్యార్థిని మృతి

## మృతికి కారణాలపై పోలీసుల ఆరా

## విచారం వ్యక్తం చేసిన ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అనస్తీషియా విభాగంలో పీజీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థిని దీపిక మృతి చెందినట్లు సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కలిసి పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. దీపిక ఆత్మహత్య చేసుకుందా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

**ఆపరేషన్ గదిలో బల్లపై :** బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు ఆ విద్యార్థిని విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఆకలిగా ఉందంటూ తోటి విద్యార్థినితో విద్యార్థిని దీపిక ఆహారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాత ఒంట్లో కాస్త ఇబ్బందిగా ఉందని చెప్పడంతో మరో వైద్య విద్యార్థిని ఇంజక్షన్ చేశారు. రాత్రి 11.30 గంటల సమయంలో ఆపరేషన్ గదిలో బల్లపై పడిపోయిన స్థితిలో ఆమె ఉన్నారు. అనంతరం మృతి చెందినట్లు గుర్తించారు.

**విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది :** విద్యార్థిని దీపిక మృతిపై ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ విచారం వ్యక్తం చేశారు. మృతురాలి తండ్రితో మంత్రి మంత్రి మాట్లాడారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. విద్యార్థిని మృతికి గల కారణాలు తెలుసుకోవాలని సీపీ రాజశేఖర్ బాబును మంత్రి ఆదేశించారు.

**దీపిక మృతిపై పోలీసులు విచారణ చేస్తున్నారు :** విద్యార్థిని అనుమానాస్పద మృతిపై విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఏడుకొండలు స్పందించారు. అనుమానాస్పద స్థితిలో దీపిక మృతి చెందిందని తెలిపారు. కడుపులో ఇబ్బందిగా ఉందని, ఇంజక్షన్ చేయాలని జూనియర్ పీజీని దీపిక కోరిందని చెప్పారు. వైద్య విద్యార్థిని దీపిక మృతిపై కమిటీ వేశామని, వేధింపులు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, జూనియర్ పీజీ స్టేట్‌మెంట్ రికార్డు చేశామని పేర్కొన్నారు. కలెక్టర్ నివేదిక అడిగారని, విచారణ తర్వాత సమర్పిస్తామని, దీపిక మృతిపై పోలీసులు విచారణ చేస్తున్నారని పోస్టుమార్టం తర్వాత దీపికపై మృతిపై స్పష్టత వస్తుందని వివరించారు.

# మౌలిక సదుపాయాలకు భూమి పూజ చేసిన సర్పంచ్ నాగరాణి.



రాయికల్ ఫిబ్రవరి 5(వార్త సంధ్య):రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యం కొరకు నూతనంగా మంజూరు అయిన ఒక్కో యూనిట్లు 2 లక్షలు మొత్తం రెండు యూనిట్లు కలిపి 4 లక్షల నిధుల తో బాల బాలికలకు వేర్వేరు గా 2 యూనిట్ల మూత్రశాలల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ తలారి నాగమణి రాజేష్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రణయ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపి రాజరెడ్డి, వార్డ్ సభ్యులు బొమ్మెన లక్ష్మీ బాబు, బూస గంగామల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొంటున్నారు

# శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష



**రాయికల్ ఫిబ్రవరి 5 ( వార్త సంధ్య):** రాయికల్ మండలంలోని కొత్తపేట శ్రీ రాజరాజేశ్వర నాగాలయం లో నిర్వహించే శివరాత్రి జాతర ఉత్సవాలపై ఆలయ కమిటీ నిర్వాహకులు మండల అధికారులతో గురువారం ఆలయ ప్రాంగణంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్ నాగార్జున మరియు ఎస్సై సుధీర్ రావు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యంగా తాగునీరు, టాయిలెట్లు, మెడికల్ కిట్లు, బస్సు రవాణా సౌకర్యాలు మరియు అంబులెన్స్ సౌకర్యాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఎస్సై సుదీర్ రావు మాట్లాడుతూ.. ఉత్సవాలను నిర్ణీత సమయానికే నిర్వహించేలా ఆలయ కమిటీ చర్యలు తీసుకోవాలని అన్నారు. జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఉత్సవాల్లో అందరూ పోలీసు వారికి సహకరించాలని జాతర ఉత్సవాలకు ఆటంకం కలిగించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కొత్తపేట సర్పంచ్ మీనుగు అంజయ్య మాట్లాడుతూ జాతర ఉత్సవాలకు అధికారు

# రాయికల్ మండలం ఉపసర్పంచ్‌ల ఫోరమ్ ఎన్నిక



**రాయికల్ ఫిబ్రవరి 5 (వార్త సంధ్య):** జగిత్యాల జిల్లా రాయికల్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరమ్ నూతన అధ్యక్షులుమూగల సంజీవచారి,ఉపాధ్యక్షులుగా, భూక్యా శంకర్ నాయక్, అల్లెపు గంగాధర్ ,ప్రధాన కార్యదర్శిగా ఎండీ చంద్ పాషా,కోశాధికారిగా మారుపాకనారాయణ ,సలహాదారులుగా,మాలోతు సూర్య, కాయితీ సంజీవ్, ఆర్మూరి లక్ష్మీనారాయణ, గుగ్లవత్ శ్రీనివాస్ ను కార్యవర్గ సభ్యులు బోడ రాజ కుమార్, బానవత్ రవి, కొంపెల్లి ప్రియాంక, అల్లెపు నర్సయ్య, కుర్ర మల్లయ్యలను ఏకగ్రీవంగా సభ్యులందరూ ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ, ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, మండల స్థాయి అభివృద్ధికి ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాఖ్యలపై భగ్గుమన్న వెలమ సంఘం వెలమ పై కక్ష సాధింపు తగదు.



**రాయికల్ ఫిబ్రవరి 5(వార్త సంధ్య):**రాయికల్ పట్టణంలోని వెల్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వెల్మ సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అన్ని కులాల,సామాజిక వర్గాల, ప్రజలను సమానంగా చూస్తా నని ప్రమాణం చేసి ముఖ్యమంత్రి కాగా రాజ్యాంగబద్ధంగా ఆయన చేసిన ప్రమాణాన్ని తరుచుగా విస్మరిస్తూ వెల్మ కులం మీద విరుచుక పడుతూ వెల్మలపై కాక్ష్య సాధింపు కు దిగుతున్నారని వ్యక్తులతో రాజకీయ వైరుధ్యాలు ఉంటే అట్టి వ్యక్తులతో చూసుకోవాలి కానీ పదేపదే వెలుమ కులాన్ని దూషిస్తూ వ్యాఖ్యలు చేయడం వలన మా మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇకపై ఇలాగే ప్రవర్తిస్తే ఊరుకోం అని కాంగ్రెస్ పార్టీలో ఉన్న వెల్మ నాయ కులు ఆలోచించి రేవంత్ రెడ్డి ని గట్టిగా నిలదీయాలి అని ఇకనైనా మంచి బుద్ధిని నేర్పాలని హితవు పలికారు ఆయన రావుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఐ కమాండ్ దృష్టికి తీసుకుపోయి ముఖ్యమంత్రి పై చర్యలు తీసుకునేలా చేయాలని సూచించారు.ఇకనైనా ముఖ్యమంత్రి

# సిపిఐలో 50 కుటుంబాలు చేరిక

## సిపిఐ అభ్యర్థుల గెలుపుకోసం పాటుపడాలి

## ఎమ్మెల్యే కూనంనేని పిలుపు



**కొత్తగూడెం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 05 (వార్త సంధ్య) :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) లో బుధవారం ప్రకాష్ నగర్కు చెందిన 50 కుటుంబాల వారు చేరారు. పల్లపు సాగర్, పల్లవు విజయ్ కుమార్, బోదాసు రామ్ ప్రసాద్, ఆధ్వర్యంలో చేరిన వారికి ఎంఎల్ఎ కూనంనేని ఎర్రకుండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో చేరిన వారు ప్రజా సంక్షేమం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని, వందేళ్ల పాటు ప్రజల కోసం పోరాటాలు చేస్తుంది కమ్యూనిస్టులే అన్నారు. జరగనున్న కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని చెప్పారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎంఎలి కూనంనేని చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై సిపిఐలో చేరినట్లు తెలిపారు. ఆయన సారథ్యంలో ముందుకు సాగుతామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# హజ్ సొసైటీ ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి వర్యులు ఎన్ ఎం డి ఫరూక్




**తిరువూరు ఫిబ్రవరి 05 (వార్తసంధ్య) :** ఎన్టీఆర్ జిల్లా విజయవాడ లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఇన్స్పెక్టర్ మరియు జిల్లా హజ్ సొసైటీ ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి వర్యులు ఎన్ ఎం డి ఫరూక్ ని కలిసి పలు సమస్యలపై మంత్రి కి విన్నవించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ డైరెక్టర్ అబ్దుల్ హుస్సేన్ ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హాసన్ భాష , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, మరియు హజ్ కమిటీ డైరెక్టర్లు, పాల్గొన్నారు

# మునుగోడు మండలంలో డీలర్ షాపుల పర్యవేక్షణ



**మునుగోడు :ఫిబ్రవరి- 05 (వార్త సంధ్య.) :** మునుగోడు మండలంలోని మునుగోడు గ్రామంలో వ్యవసాయ శాఖ ఏవో పద్మజ ఆధ్వర్యంలో డీలర్ షాపులను పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు ముఖ్య సూచనలు తెలియజేశారు.రైతులందరూ "బయోస్ / ఆర్గానిక్" అనే పేర్లతో అమ్మే మందులను కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా జాగ్రత్తగా పరిశీలించి మాత్రమే తీసుకోవాలని సూచించారు. లైసెన్సు కలిగిన డీలర్ షాపులలోనే ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని తెలిపారు.కొనుగోలు చేసిన మందుల బిల్లులను, అలాగే ఉపయోగించిన మందుల పాకెట్లను భద్రంగా నిల్వ చేసుకోవాలని సూచించారు పంటలకు వేసే మందుల విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకే ఉపయోగించుకోవాలని తెలిపారు లైసెన్స్ లేని, బిల్లు ఇవ్వని దుకాణాలు లేదా వ్యక్తుల వద్ద ఎరువులు, పురుగు మందులు, ఆర్గానిక్/బయోస్ అని చెప్పే ఉత్పత్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదని హెచ్చరించారు. నిజమైన సేంద్రియ వ్యవసాయం అంటే రైతులు తమ వద్ద ఉన్న వనరులతోవేపాకు, ఇతర ఆకులు, పశువుల పేడ, పశువుల ఎరువు, పంటల అవశేషాలు వంటి వాటిని ఉపయోగించి స్వయంగా తయారు చేసుకుని వినియోగించుకోవడమేనని వివరించారు.మార్కెట్లో వివిధ పేర్లతో లభించే బయోస్ ఉత్పత్తులను ఉపయోగించే ముందు తప్పనిసరిగా జాగ్రత్తగా పరిశీలించి మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.

# నకిరేకల్ నియోజకవర్గం కుమ్మరి మండల కన్వీనర్ నియామకం



**నకిరేకల్ :ఫిబ్రవరి -05 (వార్త సంధ్య) :** నకిరేకల్ నియోజకవర్గంలో మొత్తం 6 మండలాలు కలవు.అవి కట్టంగూరు, నకిరేకల్,చిట్యాల,నార్కట్పల్లి,కేతేపల్లి, శాలిగౌరారం.తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం,నల్లగొండ జిల్లా కో-కన్వీనర్ గంగాధరి వెంకటేశ్వర్లు గురువారం నాడు కట్టంగూరు మండల కన్వీనర్గా ఈదులూరు గ్రామానికి చెందిన నిమ్మనగోటి సత్తయ్య నియమించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నల్లగొండ నియోజకవర్గ ఇన్చార్జి నిమ్మనగోటి శ్యాంప్రసాద్, నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్చార్జి ఎలిజాల వెంకన్నతో పాటు కమిటీ సభ్యులు చిట్టిమళ్ళ దశరథ,బొడ్డుపల్లి రమేష్, నిదానంపల్లి వెంకటస్వామి, కంచర్ల రాము,చిట్టిమళ్ళ ఆంజనేయులు, నిమ్మనగోటి సత్తయ్య,ఆమంచి వెంకటేశ్వర్లు,ఆమంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ జిమ్ మరియు పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు

## - బి.యన్ రెడ్డి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 05:** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీ ఫేస్ 2 కాలనీలో 21.00 లక్షల రూపాయలతో అభివృద్ధి చెయ్యనున్న ఓపెన్ జిమ్ మరియు పిల్లల ఆట పరికరాలను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ఓపెన్ జిమ్ మరియు పిల్లల ఆటపరకరాల కొరకు 21.00 లక్షల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని అట్టి పరికరాలను త్వరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీచర్స్ కాలనీ ఫేస్ 2 అధ్యక్షులు శివ ముదిరాజ్, చైతన్య నగర్ కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, జలంధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కోశాధికారి మహిపాల్ రెడ్డి, సంజీవ యాదవ్, రామారావు, రామ్ రెడ్డి, వీరభద్ర రావు, జగదీష్ రెడ్డి, సాయి రెడ్డి, చైతన్య నగర్ కాలనీ సెక్రటరీ యాదయ్య, కోశాధికారి చంద్ర శేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామ్ రెడ్డి, వినోద్,శివ, జనార్దన్ రెడ్డి, మరియు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

# అనుమగల్ లో పర్యటించిన హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 05:** హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు హయత్ నగర్ అనుమగల్ లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానికులు విజ్ఞప్తి చేయడంతో సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన కార్పొరేటర్, సంబంధిత అధికారులతో మాట్లాడి అంచనా వ్యయం సిద్ధం చేసి త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఆదేశించారు. బస్తీ అభివృద్ధికి అవస రమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, బస్తీ వాసులు జెనిగే కుమార్, జయ ఈశ్వర్, బోడ శ్రీ రాములు, జెనిగే గిరి, గంగాని రాము, మరియు బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగమంటేనే చంద్రబాబునాయుడుకు చిన్నచూపు..

## పోతిరెడ్డిపాడు హెడ్రెగ్యులేటర్ పూర్తి చేయకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉద్ధృతం..

**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 05 ( వార్త సంధ్య ) –** : చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ను నిలిపివేయడంతో రైతులు ఆగ్రహంతో ఉన్నారని మదనపల్లె వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసేలా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఛలో పోతిరెడ్డిపాడు కార్యక్రమం చేపట్టడం జరిగిందని, అందులో భాగంగా పోతిరెడ్డిపాడుకు మాజీ మంత్రి, పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలిసి నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఛలో పోతిరెడ్డిపాడు కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ స్టేట్ కో - ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, చల్లా మధు, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, కర్నూలు మేయర్ బి.వి. రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైయస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, మక్బుల్ బాషా, ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులను నిస్సార్ అహమ్మద్ పలకరించి, పార్టీ కార్యక్రమాలను సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం నాయకులతో కలిసి నిస్సార్ అహమ్మద్ పోతిరెడ్డిపాడు హెడ్రెగ్యులేటర్ పనులను పరిశీలించారు.









ఈ సందర్భంగా మీడియాతో నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పోతిరెడ్డిపాడు హెడ్రెగ్యులేటర్ పనుల వద్దకు వేలాది మంది తరలివచ్చారని తెలిపారు. వ్యవసాయ రంగమంటేనే చంద్రబాబునాయుడుకు చిన్నచూపని విమర్శలు గుప్పించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసి రాయలసీమకే కాదని మొత్తం రాష్ట్రానికే అన్యాయం చేశాడని, రాయలసీమతో పాటు నెల్లూరుకు పోతిరెడ్డిపాడు ప్రాణవాయువని వివరించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్వీర్యం చేస్తూ సాగు, తాగు నీరు అందకుండా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి మేలు చేసే విధంగా పోతిరెడ్డిపాడు పనులు నిలిపివేశారని ఆరోపించారు. ఇది కేవలం ఆరంభం మాత్రమే కూటమి ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్రెగ్యులేటర్ పూర్తి చేయకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉద్ధృతంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు..

# కమ్యూనిస్టు కూటమి గాలి వీస్తోంది

## ప్రజా శ్రేయస్సే మా ధ్యేయం

## సీట్ల పంపిణీలో సమన్యాయం పాటించాం

## జనరల్ స్థానాల్లో కూడా ఎస్సీలను నిలిపాం

## సిపిఐ కూటమి అభ్యర్థులను గెలిపించండి

## విలేకరుల సమావేశంలో కూనంనేని



**కొత్తగూడెం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 05 (వార్త సంధ్య) :** ప్రస్తుత కార్పోరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు కూటమి గాలి వీస్తోందని, 60 డివిజన్ల వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని, ఎక్కడ చూసినా ఎరుపు, పసువు, నీలి జెండాల రెపరెపలు కనివిందు చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్లో గురువారం దళిత సంఘాల ఐఖ్య సంఘటిత వేదికతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా శ్రేయస్సే తమకు ధ్యేయమని, తమకు పదవులు, అధికారం ముఖ్యం కాదన్నారు. కార్పోరేషన్ సాధించుకోవడం ద్వారా తన చిరకాల స్వప్నం సాకరమైందని, తద్వార పాల్వంచ నుండి సుజాతనగర్ వరకు అనూహ్యమైన అభివృద్ధి జరగనుందని, పరిశ్రమలు రానున్నాయని, ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల జీవనవిధానం మెరుగు పడుతుందని చెప్పారు. ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు వచ్చాయని, వాటితో కార్పోరేషన్ వ్యాప్తంగా అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో సీట్ల సర్దుపాటు విషయంలో సమన్యాయం పాటించామని, జనరల్ స్థానాల్లో సైతం ఎస్సిలను నిలిపామని, బిసి, మైనార్టీలకు సముచిత గౌరవం దక్కిందన్నారు. ఇది అందరి ఎర్రజెండా అని, ఈ



ఎర్రజెండాను గెలిపించుకోవడం ద్వారా అభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. సిపిఐ, టిడిపి, దళిత సంఘాల ఐఖ్య సంఘటి వేదిక కలిసి కష్టపడి పనిచేసి తమ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్కు మనకు ఎలాంటి వైరం లేదని, సీట్ల సర్దుబాటు విషయంలో సంఖ్యా పరమైన సమస్య తలెత్తడంతో సిపిఐ కూటిమి 60 సీట్లలో పోటీకి వెళ్లిందన్నారు. విధాన పరమైన విధానాల వల్లే విడివిడిగా పోటీ చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా కలిసే ఉన్నామని స్పష్టం చేశారు. తాము అధికారం కోసం కక్కుర్తి పడే వారమైతే ఎప్పుడో మంత్రులమయ్యే వారమని, ఎర్రజెండా నేతలు ప్రధాని పదవిని సైతం ప్రజల కోసం ప్రక్కకు పెట్టారని చెప్పారు. ప్రభుత్వం మాదే, ఎంఎల్ఏ ది ఏముందిలే అంటూ కొందరు అంటున్నారని, మరి ఎంఎల్ఏ బాధ్యలు ఎంటో తెలియదా అని అన్నారు. కమ్యూనిస్టులది ఏముందిలే అనడటం అవివేకం అని, ప్రజా స్వామ్య ప్రభుత్వంలో ఎవరి పనులు వారివే అని గుర్తు చేశారు. 12వ వార్డు అభ్యర్దిని నాగలక్ష్మీ, 13వ వార్డు అభ్యర్థిని పి.ఇందిరా ప్రియదర్శిని, 15వ వార్డు అభ్యర్థిని కె సాహితి ఎన్నికల గుర్తు కంకి కొడవలికి ప్రజలు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కూసపాటి శ్రీనివాన్, బొమ్మెర శ్రీనివాస్, రత్నకుమారి, మేదిని లక్ష్మీ, బొంకూరి వరమేష్, ఇటికల మొగిలి, దాసరి సారధి, ఎర్ర కామేష్, మాతంగి సంతోష్, పీక కృష్ణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# హబిదా జీవితం ఎంతో మంది మహిళలకు ఆదర్శం

**తిరువూరు ఫిబ్రవరి 05 (వార్తసంధ్య) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణం లైన్ బజార్ కు చెందిన షేక్ యాఖుబ్ మస్తాన్ బి దంపతుల ఏకైక కుమార్తె షేక్ హబిదా జీవితం, ఆమె సాధించిన విజయాలు, ఎదుర్కొన్న కష్టాలు, ప్రదర్శించిన ధీరత్వం నేటి సమాజంలో ఎంతో మంది మహిళలకు గొప్ప ఆదర్శం మరియు స్ఫూర్తిదాయకం అనటం లో ఎలాంటి అతిశయోక్తి లేదు తల్లి తండ్రుల మధ్య అల్లారు ముద్దు గా పెరిగిన తనను ఊహ తెలియని వయసు లో వివాహం చేశారు.ఆ తరువాత భర్త తో కొన్ని సంవత్సరాలు కాపురం చేసాక పిల్లలు పెరిగి యుక్త వయసు కు వచ్చే సమయం లో భర్త అనారోగ్యం తో చనిపోవటం తో బంధువులు స్నేహితులు ఎవరూ కూడా ఆమె కు ఆర్థికంగా సహాయం చేయటానికి దరి చేరలేదు.అయినా హబిద ఆత్మ విశ్వాసం కోల్పోకుండా వెనుకడుగు వేయకుండా పిల్లలను చదివించటానికి ఆమె పడిన కష్టం వర్ణాతీతం అని చెప్పవచ్చు.బంధువులు దగ్గర సహాయం తీసుకోకుండా ఒక మహిళ గా తానే టైలరింగ్ చేస్తూ కష్టపడి ఏదో ఒక పని చేసుకుంటూ పేదరికం అనేది పిల్లల భవిష్యత్ కు అడ్డు రాకూడదు అనే ఉద్దేశం తో తానే ఉన్నత చదువు చదివిస్తుంది.ఆమె తండ్రి చనిపోయి సోదరుడు కి వివాహం కావటం తో ఆమె తల్లి కి ధైర్యం ఇస్తూ ఒంటరి మహిళ గా నేటి సమాజం లో కీలక పాత్ర పోషిస్తున్న గొప్ప మహిళా మూర్తి షేక్ హబిద.బాల్యం అంతా బాధలతో ఆర్థిక ఇబ్బందులు తో సాగినా ఓర్పు లో నేర్పు లో నిరంతరం శ్రమిస్తూ నలుగురికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తుంది. తన పిల్లలే తన ప్రపంచం అనుకుంటూ పిల్లల భవిష్యత్ బంగారు బాట వేయాలని అలుపెరుగని పోరాటం చేస్తూ జీవనం కొనసాగిస్తుంది.దైవత్వం లో హబీద ముందు వరుస లో ఉంటుంది ఆమెకు అల్లాహ్ పై ఉన్న ప్రేమ భక్తి వెలకట్టలేనిదని చెప్పవచ్చు నమాజ్ చదవడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుందని కష్టాల్లో ఉన్నప్పుడు దైవ సహాయం



పొందడానికి నమాజ్ ఒక సాధనమని ఆమె ఎంతోమందికి సూచనలు ఇచ్చింది.హబీద ఇంటి నుండి బయటకు వచ్చే క్రమం లో బురఖా ధరించి బయటకు అడుగు వేస్తుంది. తల్లి తండ్రుల నైతిక విలువలు నేటికీ ఆమె ఆచరిస్తుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్నపటికీ కూడా నేటికీ ఒక్క ప్రభుత్వ పథకం కూడా ఆమెకు అందకపోవటం బాధాకరం.ఉండటానికి సొంత గూడు కూడా లేదు ప్రభుత్వం త్వరితగతిన స్పందించి ఇలాంటి పేద వారిని గుర్తించి వారికీ ప్రభుత్వ కాలనీ గృహాలు మంజూరు చేయాలి.ఆమె గొప్ప జీవితం ఎంతో మంది మహిళలకు ఆదర్శమని చెప్పవచ్చు ఆమెను పలువురు మహిళలు ఆదర్శం గా తీసుకోవాలనేదే ఈ సందేశం. గ్రేట్ షేక్ హబిద మేడం

# జగిత్యాల జిల్లాలోని 5 మున్సిపాలిటీల ఎన్నికలకు పోలింగ్ కు కౌంటింగ్ కు ఏర్పాట్లు పూర్తి

## - జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 5 (వార్త సంధ్య):** మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. మున్సిపల్ ఎన్నికల పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా (కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపెల్లి) కలెక్టర్ లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జగిత్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పి అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ లకు ఆదేశాలు జారీ చేశారు.

పోలింగ్ కు అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని, పోలింగ్ బృందాలు , డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్ లలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత మున్సిపాలిటీలలో చైర్ పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక కోసం ఫారం 2 లను సిద్ధం చేసి సంసిద్ధం కావాలని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర ప్రజాప్రతినిధులకు ముందుగానే సమాచారం అందించాలని అన్నారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని 5 మున్సిపాలిటీల ఎన్నికలకు మరియు పోలింగ్ కు మరియు కౌంటింగ్ కు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. ఇందుకుగాను స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, కావలసిన సిబ్బందిని నియమించామని తెలిపారు. రెండవ రాండమైజేషన్ పూర్తిచేశామని తెలిపారు.

5 మున్సిపాలిటీలో జరుగు ఎన్నికలకు అవసరమైన పోలింగ్ మరియు కౌంటింగ్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.




ఎన్నికలకు సంబంధించిన సిబ్బందికి పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించు విధులపై తగిన శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు అన్నివిధాలుగా సిద్ధం గా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ

జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో జరగనున్న ఎన్నికలు మరియు పోలింగ్ ల కొరకు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా మరియు సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ లను గుర్తించి తగిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల, మెట్ పెల్లి ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, జెడ్పి సి ఈ వో గౌతమ్ రెడ్డి, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ హక్కుల కోసం వైసీపీ చలో పోతిరెడ్డిపాడు నిరసన..

## లిఫ్ట్ ఇరిగేషన్ ఆపడం సీమ ద్రోహమని చంద్రబాబుపై నేతల ఆగ్రహం..





అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 05 ( వార్త సంధ్య ) – ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ ప్రయోజనాలు పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు ఆరోపించారు. రేవంత్ కోసం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆపేశారని విమర్శించారు. రాయలసీమ ప్రాంత ప్రయోజనాలను ఫణంగా పెడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను నిలిపివేయడంపై వైఎస్ఆర్‌సీపీ పోరుబాట పట్టింది. కర్నూలు జిల్లాలోని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సాక్షిగా గురువారం నిర్వహించిన చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ పోరాటం కేవలం ఆరంభం మాత్రమేనని, సీమ ప్రయోజనాల కోసం మెడలు వంచైనా సరే ప్రాజెక్టును సాధించుకుంటామని వారు హెచ్చరించారు.

**రేవంత్ రెడ్డితో చీకటి ఒప్పందం చేసుకున్నారని సజ్జల ఆరోపణలు..**

వైఎస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కుదుర్చుకున్న చీకటి ఒప్పం దం వల్లే రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆగిపోయిందని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఉన్న తన ఆస్తు లను కాపాడుకోవటానికి, ఓటు నోటు కేసు భయం వల్లే చంద్రబాబు రాయలసీమ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడిన మాట లపై చంద్రబాబు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రాంతానికి 800 అడుగుల స్థాయి లోనే శ్రీశైలం నీరు అందుతున్నప్పుడు రాయలసీమకు ఆ హక్కు ఎందుకు ఉండకూడదని వారు నిలదీశారు.

**80 శాతం పూర్తయిన ప్రాజెక్టును ఆపడం మహాపాపం..**

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు ఇప్పటికే 80 శాతం పూర్తి అయిన ప్రాజెక్టును అర్థాంతరంగా ఆపేయండి మహా పాపమని, ఇది రాయలసీమ సాగు, తాగు నీటి కష్టాలకు ఏకైక పరిష్కారం అని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. వైఎస్ఆర్ హయాంలోనే రాయలసీమ సుభిక్షంగా మారిందని ఆ వారసత్వా న్ని జగన్ కొనసాగిస్తుంటే కూటమి ప్రభుత్వం అడ్డుపడుతోందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై నేతలు ఘాటుగా విమర్శలు చేశారు. ఈ సభా వేదికపై కేవలం సాగు నీటి ప్రాజెక్టులే కాకుండా ఇతర ప్రజా సమస్యలపై నాయకులు గళమెత్తారు. తిరుమల లడ్డూ గురించి ప్రశ్నిస్తే దాడులు చేయిస్తున్నానని విమర్శించారు. రాష్ట్రంలో యూరియా కొరతను ప్రశ్నిస్తే, యూరియా వాడం వల్ల క్యాన్సర్ వస్తుందని ప్రభుత్వ వింత సమాధానాలు చెబుతోందని మండిపడ్డారు. రాయలసీమకు వచ్చిన ఎయిమ్స్, హైకోర్టు వంటి సంస్థను చంద్ర బాబు తరలించుకుపోయారని నేతలు ఆరోపించారు. పోతిరెడ్డిపాడు వద్ద జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కాకాణి గోవర్ధన్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి, గడికోట శ్రీకాంత్, ఎస్వీ మోహన్ రెడ్డి, యువనేత బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, చల్లా మధు, సహా మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించి అనంతరం వారు బహిరంగ సభలో ప్రసంగించారు..







# టేకులపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన,డీ.ఎస్.పి వెంకన్న బాబు



**టేకులపల్లి, ప్రతినిధి ఫిబ్రవరి 05 (వార్త సంధ్య):** ఇల్లందు డీ.ఎస్.పి వెంకన్న బాబు టేకులపల్లి పోలీస్ స్టేషన్ ను గురువారం సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన, పెండింగ్ లో ఉన్న కేసుల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. బాధితులు పోలీస్ స్టేషన్ కు వస్తే తక్షణమే స్పందించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ ఆలకుంట రాజేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# "జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయ్.. వస్తున్నాయ్" అంటూ కమలహాసన్ తెలుగు భాషతో స్పీచ్..



అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 05 ( వార్త సంధ్య ) – : ఎవరికీ అధికారం శాశ్వతం కాదని ప్రపంచ చరిత్రలో ఏ ప్రభుత్వం శాశ్వతంగా లేదని మక్కల్ నీది మయ్యం అధినేత, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా తొలిసారి కమల్ హాసన్ రాజ్యసభలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయ్.. వస్తున్నాయ్" అంటూ తెలుగు భాషతో స్పీచ్ మొదలు పెట్టారు. ఏం మాట్లాడుతున్నానో తెలుగు వారికి అర్థమవుతుందన్నారు. కమలహాసన్ చేసిన వ్యాఖ్యలను ఏపీలోని వైసీపీ శ్రేణులు తెగ ట్రోల్ చేస్తున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ఓటర్ల జాబితాను తీవ్రంగా విమర్శించారు. తమిళనాడులో దాదాపు కోటి మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని.. వారంతా బతికినంత కాలం చనిపోయే ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీహార్‌ను ఉదాహరణగా చూపిస్తూ ఎన్నికల కమిషన్ జీవిస్తున్నవారిని కూడా చనిపోయినట్లుగా పేర్కొంటుందని గుర్తుచేశారు. ఇదొక కొత్త రకమైన వ్యాధిగా అభివర్ణించారు. ఈ వ్యాధి దేశ వ్యాప్తంగా వ్యాప్తి చెందకూడదన్నారు. ఎన్నికల కమిషన్ అయితే ఈ వ్యాధి వ్యాప్తి చేయడానికి పూనుకుందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ మా ఓటు హక్కును తనిఖీ చేస్తోందని స్పెల్లింగ్‌లు, చిరునామాలు తనిఖీ చేస్తున్నారన్నారు. అక్రమ ఎన్నికల ద్వారా విజయం సాధించాలని చూస్తున్నారని విమర్శించారు. అయినా ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని ఈ ప్రపంచంలో ఏ ప్రభుత్వం శాశ్వతం కాదని హెచ్చరించారు. త్వరలో దేశ వ్యాప్తంగా నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడు, కేరళ, బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ 'సర్' నిర్వహించింది. డిసెంబర్‌లో ముసాయిదా విడుదల చేసినప్పుడు తమిళనాడులో 97 లక్షల మంది ఓటర్లను తొలగించినట్లుగా ప్రకటించింది. వారంతా చనిపోయారని/ బదిలీ చేయబడ్డారని పేర్కొంది. అనంతరం 1.90 కోట్ల మంది ఓటర్లుగా ఉన్నట్లు తెలిపింది. తుది జాబితా ఫిబ్రవరి 14న విడుదల చేస్తామని స్పష్టం చేసింది. అనంతరం ఎన్నికల షెడ్యూల్ రానుంది.

# ఇంతకీ మీ నలుగురు ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నారని ప్రశ్న..

## చంద్రబాబు, పవన్ మాట్లాడిన మాటలన్నీ రాజకీయాల్లో వారి పతనానికి పరాకాష్ట.. పేర్ని నాని




అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 05 ( వార్త సంధ్య ) – : కూటమి ప్రభుత్వం ముసుగులో నారా చంద్రబాబు ప్రభుత్వం ఉందని ఇంతకీ చంద్రబాబు, పవన్, మాధవ్, కేశవ్ ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారని మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. లడ్డూ వివాదంపై తాజాగా గురువారం మాజీ మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. కేశవ్ తన ఆర్థిక శాఖ గురించి, ప్రభుత్వ అప్పుల గురించి పట్టదు. ఆ శాఖను ఆయన నడుపుతారా. చంద్రబాబు నడుపుతారా తెలియదన్నారు. కెమికల్స్ కలిపి ఆవు నెయ్యి కలిపారని చెప్పిన కేశవ్ తక్కువ ధరలకు నెయ్యి కొన్నారని కాబట్టి అది కల్తీ నెయ్యి అంటున్నారన్నారు. వారి ప్రభుత్వంలోనే హర్ష్ డెయిరీని ఇన్స్పెక్షన్ చేసి అన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని అప్రూవ్ చేశారని ఆరోపించారు. అక్టోబర్ 2018 మాకేం సంబంధం ఫిబ్రవరి 2019 మాకేం సంబంధమని పేర్ని నాని ప్రశ్నించారు. మరి మే 2019 లో కేబినెట్ ఎలా పెట్టారని ప్రశ్నించారు. మీ ఆపద్ధర్మ ప్రభుత్వంలో చాలా నిర్ణయాలు కూడా తీసుకున్నారు. హర్ష్ ఫ్రెష్ డెయిరీ నుంచి 291 రూపాయలకు టీడీపీ కొనుగోలు చేసింది. మరి ఇది భోలే బాబా డెయిరీ నే కదా అని నిలదీశారు. 319, 329 తప్పన్నారు. తాము రావటానికి రెండు నెలల ముందు 291కి వాళ్ళు ఎలా కొనుగోలు చేశారని చెప్పారు. 2014 19 మధ్య హర్ష్ ఫ్రెష్ డెయిరీ నుంచి కొన్నారు. మీ ప్రభుత్వం సమయంలో మీ సొంత సంస్థ హెరిటేజ్ రేట్లు ఎలా ఉన్నాయో చెప్పే ధైర్యం మీకు ఉందా అని మాజీ మంత్రి పేర్ని నాని నిలదీశారు. "హెరిటేజ్ కంపెనీలో ప్రతీ ఆరు నెలలకు రేటు ఎలా ఉందో చెప్పండి. ఎవరు అపచారం చేశారో. ఎవరు హిందువో. ఎవరు ఏంటో అర్థమవుతుంది. పవన్ ఉచ్చం నీచం లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్ ఎన్ని మతాలు మారారు. తమ్ముడు కోటింగ్ ఇచ్చిన తర్వాత ఒక అన్నయ్య మాట్లాడారు. సనాతన హిందువని చెప్పుకునే పవన్, నాగబాబుకు దేవుడంటే భయం లేదు. భక్తి లేదు. జగన్ మీరు మా మతం జోలికి రావొద్దంటూ దిగజారి మాట్లాడారు. మీ ప్రభుత్వం హాయంలో పెంటపాడులో తగలబడ్డ రథం ముద్దాయిని ఇప్పటి వరకు పట్టుకున్నారా. 250 ఆలయాలు ధ్వంసం చేశారని చంద్రబాబు మాట్లాడారు. మీ హయంలో విజయవాడలో ఎన్ని ఆలయాలు ధ్వంసం చేశారు. ఎంత నీచంగా ఆలయాలు, గర్భ గుడుల్లో విగ్రహాలు కూడా కూల్చివేశారు. మీరు కూలదోసిన ప్రతీ ఆలయాన్ని పునః ప్రతిష్ట జేసింది జగన్ కాదా. పవన్ కళ్యాణ్ అయోధ్యకు యానిమల్ ఫ్యాట్‌తో తయారు చేసిన లక్ష లడ్డూలు సప్లై చేశారు. దేశం మొత్తం తినిపించారని నీచంగా మాట్లాడారు. పాలకమండలి సభ్యులు మహారాష్ట్రకు చెందిన సౌరభ్ గోరా, మైహోమ్స్ రామేశ్వరరావులు నెయ్యి వారే ఇచ్చి లడ్డూలు తయారు చేయించారు. బూట్లు వేసుకుని దేవుడికి కొబ్బరి కాయలు కొట్టి, పూజలు చేసే చంద్రబాబు తల్లిదండ్రులు చనిపోతే జుట్టు కూడా ఇవ్వనివాడు హిందూ ధర్మాన్ని గౌరవించేవారు. జగన్‌ను ప్రజల ద్వారా గెలవలేక నిందించటమే పనిగా పెట్టుకున్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులను నానా ఇబ్బందులు పెడుతుందెవరు. చంద్రబాబు, పవన్ మాట్లాడిన మాటలన్నీ రాజకీయాల్లో వారి పతనానికి పరాకాష్టలా ఉన్నాయని పేర్ని నాని వ్యాఖ్యానించారు.

# మున్సిపల్ ఎన్నికలు తప్పుల్లేకుండా నిర్వహించాలి : అధికారులకు ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్ ఆదేశం



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5 ( వార్త సంధ్య ) :** ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్కరూ పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్, పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మున్సిపాలిటీకి సంబంధించిన ఎన్నికల ఏర్పాట్లు, సామగ్రిని నిశితంగా పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్, పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే పాఠశాలలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికలకు అవసరమైన స్టేషనరీ, ఇతర ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ యోగేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కౌంటింగ్ ప్రక్రియ వివరాలను మున్సిపల్ కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట శంకర్‌పల్లి తహశీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# రాష్ట్రంలో రూ.12,967 కోట్ల రైల్వే ప్రాజెక్టులు పూర్తి

## కొనసాగుతున్న కొత్తలైన్ల నిర్మాణ పనులు

## రూ.34,680 కోట్ల రైల్వే ప్రాజెక్టుల పనుల కొనసాగింపు

## గత నాలుగు ఏళ్లలో 15 కొత్త లైన్లు, 50 డబ్లింగ్ లైన్లకు సర్వే పనులు చేపట్టినట్లు వివరణ



ఏపీలో ఇప్పటి వరకు రూ.12,967 కోట్ల విలువైన 10 రైల్వే ప్రాజెక్టులు పూర్తయ్యాయని, ఇప్పుడు రూ.34,680 కోట్ల విలువైన మరో 16 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, పుట్టా మహేష్‌కుమార్‌లు అడిగిన వేర్వేరు ప్రశ్నలకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. గత 4 ఏళ్లలో 15 కొత్త లైన్లు, 50 డబ్లింగ్ లైన్ల కోసం సర్వే పనులు చేపట్టామని ఆయన వివరించారు. వీటి మొత్తం పొడవు 6,985 కిలోమీటర్లని వెల్లడించారు. 2025 ఏప్రిల్ 1 నాటికి ఏపీకి 4,499 కిలోమీటర్ల పొడవైన 12 కొత్త లైన్లు, 27 డబ్లింగ్ పనులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. వాటి విలువ రూ.70,232 కోట్లని ఆయన వెల్లడించారు. అందులో 1,178 లైన్లు ప్రారంభం అయ్యాయని, అందుకోసం రూ.28,039 కోట్లు ఖర్చు చేసినట్లు రైల్వేమంత్రి తెలిపారు.

**మొత్తం ప్రాజెక్టుల విలువ :**

గుంటూరు డివిజన్‌లో రవాణా సౌకర్యాలను సులభతరం చేయడానికి గుంటూరు–గుంతకల్లు (401 కి.మీ.), గుంటూరు–బీబీనగర్ (239 కి.మీ.) డబ్లింగ్ పనులు, గుంటూరు యార్డ్‌కు మల్టీ ట్రాకింగ్, ఎర్రుపాలెం– అమరావతి– నంబూరు మధ్య 57 కిలో మీటర్ల పొడవైన కొత్తలైన్ల నిర్మాణ పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ రూ.9,353 కోట్లని తెలిపారు. ఇందులో గుంటూరు–గుంతకల్లు డబ్లింగ్ పనులు 357 కి.మీ. మేర పూర్తయ్యాయని, మిగిలిన పనులు జరుగుతున్నాయన్నారు.

**రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో :**

అమరావతి లైన్ కోసం భూ సేకరణ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. గుంటూరు–బీబీనగర్ డబ్లింగ్ పనులు కూడా కొనసాగుతున్నాయని అన్నారు. రూ.3,796 కోట్ల విలువైన భద్రాచలం–కొవ్వూరు (119 కి.మీ.) కొత్త లైన్ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో వ్యయాన్ని పంచుకొనే పద్ధతిలో మంజూరు చేశామని, అందులో ఇప్పటి వరకు భద్రాచలం–సత్తుపల్లి (56 కి.మీ.) మధ్య లైన్ నిర్మాణం పూర్తి అవుతుందని వివరించారు.

**ఏపీలో లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములు :**

కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే ఆహార ధాన్యాల నిల్వల కోసం రాష్ట్రంలో ఎఫ్‌సీఐకి 14.35 లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములు ఉన్నట్లు కేంద్ర ఆహారం, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా తెలిపారు. ఇవికాకుండా ఎఫ్‌సీఐ కేంద్ర గోదాముల కార్పొరేషన్ నుంచి 39.38 లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములను అద్దెకు తీసుకొందని ఆయన వెల్లడించారు. బుధవారం లోక్‌సభలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. ఫుడ్ కార్పొరేషన్ ఇండియా (ఎఫ్‌సీఐ)కి కాకినాడ పరిధిలో 90,132 టన్నులు, రాజమండ్రిలో 1,05,792 టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు ఉన్నట్లు వివరించారు. కేంద్ర గోదాముల కార్పొరేషన్‌కు రాజమండ్రిలో 51,895 టన్నులు, కాకినాడలో 29,943 టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాములు ఉన్నట్లు చెప్పారు.

**ఓఎఫ్‌సీ నిర్మాణం పూర్తి :**

ఏపీలో 2,51,753 కిలోమీటర్ల మేర పొడవైన ఓఎఫ్‌సీ నిర్మాణం పూర్తి అయినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆయన లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పారు. రాష్ట్రంలో 2,759 గ్రామాలు 4జీ కనెక్షన్ల పరిధిలోకి వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

# రాజేందర్‌నగర్ ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల అబ్జర్వర్






**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 5 (వార్త సంధ్య):** గురువారం రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్‌తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు సహా ఇతర ఎన్నికల సామగ్రిని తనిఖీ చేశారు. అలాగే గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు తీరును కూడా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, భద్రంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట రాజేందర్‌నగర్ తహశీల్దార్, వేర్‌హౌస్ ఇంచార్జీ రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

## మూడు రోజుల్లో 342 మెట్రిక్ టన్నుల అదనపు వ్యర్థాల తరలింపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (వార్త సంధ్య):** జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం మూడో రోజైన గురు వారం కూడా విస్తృతంగా నిర్వహించారు. రోడ్లకు ఇరువైపుల శుభ్రత, డివైడర్లు, కెర్బ్ స్టోన్లు, సెంట్ర ల్ మీడియన్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య కార్యక్రమాన్ని అమలు చేశారు. జీహెచ్ ఎంసీ పరిధిలోని 300 వార్డుల్లో మొత్తం 316 ఏరియాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టగా, మూడు రోజుల్లో అదనంగా 269 మెట్రిక్ టన్నుల సాధారణ వ్యర్థాలు, 73 మెట్రిక్ టన్నుల నిర్మాణ వ్యర్థా లు కలిపి మొత్తం 342 మెట్రిక్ టన్నుల అదనపు వ్యర్థాలను తరలించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను జోనల్ కమి షనర్లు, డిప్యూటీ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వ హించారు.



# నోట్లో పుండ్లు ఏర్పడి ఇబ్బందిగా ఉందా..?

అయితే ఈ సహజసిద్ధమైన చిట్కాలను పాటించండి..! నోట్లో పుండ్లు అనేవి సహజంగానే చాలా మందికి వస్తుంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. ఇవి కొందరికి పెదవులపై వస్తే కొందరికి లోపలి వైపు వస్తాయి. కొందరికి నోట్లో నాలుకపై, నాలుక చుట్టూ లేదా కింద భాగంలో కూడా వస్తాయి.

నోట్లో పుండ్లు అనేవి సహజంగానే చాలా మందికి వస్తుంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. ఇవి కొందరికి పెదవులపై వస్తే కొందరికి లోపలి వైపు వస్తాయి. కొందరికి నోట్లో నాలుకపై, నాలుక చుట్టూ లేదా కింద భాగంలో కూడా వస్తాయి. కొందరికి చిగుళ్ల వాపులు కూడా వస్తాయి. రక్తస్రావం కూడా జరుగుతుంది. ఏం తినాలన్నా, తాగాలన్నా చాలా ఇబ్బందిగా ఉంటుంది. అయితే నోట్లో పుండ్లు అనేవి అనేక కారణాల వల్ల వస్తుంటాయి. బాగా వేడిగా ఉన్న ఆహారాలను తిన్నప్పుడు లేదా తాగినప్పుడు నోట్లో పుండ్లు ఏర్పడుతాయి.అలాగే టూత్ బ్రష్‌ను బలంగా వాడినా, పడని టూత్ పేస్ట్‌ను వాడినా, పోషకాహార లోపం ఉన్నా, ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉన్నా, హార్మోన్ సమస్యల కారణంగా, పలు రకాల మందులను వాడడం వల్ల కూడా నోట్లో పుండ్లు ఏర్పడుతాయి. అయితే కొన్ని రకాల చిట్కాలను పాటిస్తే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఉప్పు నీళ్లు..**

ఉప్పు నీటిని నోట్లో పోసుకుని పుక్కిలించడం వల్ల నోట్లో ఉన్న పుండ్ల సమస్య నుంచి బయట పడవచ్చు. ఉప్పు నీటిలో యాంటీ సెప్టిక్ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో ఉండే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. దీంతో నోట్లోని పుండ్లు నయమవుతాయి. 1 టీస్పూన్ ఉప్పును ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో వేసి బాగా కలిపి ఆ నీళ్లను నోట్లో పోసుకుని 30 సెకన్ల నుంచి 1 నిమిషం పాటు బాగా పుక్కిలించాలి. ఇలా రోజుకు 3 నుంచి 4 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది. తేనెలో సహజసిద్ధమైన యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో పుండ్లను తగ్గిస్తాయి. నోట్లో ఉండే నొప్పి నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. తేనెను కొద్దిగా తీసుకుని నోట్లో పుండ్లు ఉన్న చోట నేరుగా రాయవచ్చు. ఇలా రోజుకు 2 నుంచి 3 సార్లు చేస్తుండాలి. దీంతో నోట్లోని పుండ్లు తగ్గిపోతాయి.


**కొబ్బరినూనె..**

నోట్లోని పుండ్లను తగ్గించేందుకు కొబ్బరినూనె కూడా పనిచేస్తుంది. ఇందులో లారిక్ యాసిడ్ ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల నోట్లో ఉండే వాపులను తగ్గిస్తుంది. నోరు, నాలుకకు సంరక్షణ పొరగా నిలుస్తుంది. నోటి అల్సర్లను తగ్గిస్తుంది. కొద్దిగా కొబ్బరినూనెను తీసుకుని నోట్లో పుండ్లు ఉన్న చోట నేరుగా రాయాలి. రోజులో ఇలా మీకు వీలున్నన్ని సార్లు చేయాలి. దీంతో పుండ్లు తగ్గిపోతాయి. ఈ పుండ్లను తగ్గించేందుకు బేకింగ్ సోడాపేస్ట్ కూడా పనిచేస్తుంది. బేకింగ్ సోడా వల్ల నోట్లో అధికంగా ఉండే యాసిడ్ల ప్రభావం తగ్గుతుంది. దీంతో నోట్లోని పుండ్లు తగ్గిపోతాయి. ఇందుకు గాను కొద్ది మొత్తంలో బేకింగ్ సోడాను తీసుకుని కొన్ని చుక్కల నీటితో కలిపి మెత్తని పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని నోట్లో ఉండే పుండ్లపై రాయాలి. కాసేపు అయ్యాక నోట్లో నీళ్లు పోసుకుని కడిగేయాలి. ఇలా రోజూ చేస్తున్నా కూడా ఈ సమస్య తగ్గుతుంది.

**కలబంద గుజ్జు..**

కలబంద గుజ్జులో సహజసిద్ధమైన యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో ఏర్పడే అల్సర్లను తగ్గిస్తాయి. కలబంద గుజ్జును కొద్దిగా తీసుకుని నోట్లో అల్సర్లపై నేరుగా రాయాలి. కాసేపు అయ్యాక నోట్లో నీళ్లు పోసుకుని పుక్కిలించి ఉమ్మేయాలి. ఇలా రోజుకు 3 నుంచి 4 సార్లు చేయాలి. దీని వల్ల నోట్లో ఉండే నొప్పి, అల్సర్లు తగ్గిపోతాయి. సాధారణంగా ఇలాంటి చిట్కాలను పాటిస్తే 3 లేదా 4 రోజుల్లో ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. కానీ వారం రోజులు దాటినా కూడా ఈ సమస్య తగ్గడం లేదంటే అప్పుడు చాలా బలమైన కారణం ఉండి ఉంటుందని అర్థం చేసుకోవాలి. దీనికి గాను డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. వారు అన్ని విధాలుగా పరిశీలించి సమస్యను గుర్తించి అందుకు తగిన విధంగా చికిత్సను అందిస్తారు. దీంతో నోట్లోని పుండ్లు తగ్గిపోతాయి.

# లివర్‌ను ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకోవాల్సిందే



లివర్ క్లీన్ అవ్వాలంటే వీటిని తీసుకోవాలి..! మన శరీరంలో అంతర్గతంగా ఉండే అవయవాల్లో అతి పెద్ద అవయవం లివర్. ఇది మన శరీరంలో సుమారుగా 500కు పైగా విధులను నిర్వహిస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించడం లివర్ ముఖ్యమైన పనుల్లో ఒకటి. మన శరీరంలో అంతర్గతంగా ఉండే అవయవాల్లో అతి పెద్ద అవయవం లివర్. ఇది మన శరీరంలో సుమారుగా 500కు పైగా విధులను నిర్వహిస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించడం లివర్ ముఖ్యమైన పనుల్లో ఒకటి. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, తాగే పానీయాలు, పలు ఇతర కారణాల వల్ల లివర్ ఆరోగ్యం దెబ్బ తింటుంది. లివర్ పనితీరు మందగిస్తుంది. దీంతో లివర్ చేసే పనులను సక్రమంగా నిర్వహించలేకపోతుంది. దీని వల్ల అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతుంటాయి. ఇలా జరగకుండా ఉండాలంటే లివర్‌ను ఎప్పటికప్పుడు ఆరోగ్యంగా ఉంచుకోవాలి. అందుకు గాను లివర్‌ను క్లీన్ చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి పలు ఆహార పదార్థాలు ఉపయోగపడతాయి. వీటిని తినడం వల్ల లివర్ క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటుంది. ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయి.

**వెల్లుల్లి..**

మనం వెల్లుల్లిని తరచూ వంటల్లో ఉపయోగిస్తుంటాం. వెల్లుల్లిలో ఆల్లిసిన్, సెలీనియం అధికంగా ఉంటాయి. ఇవి లివర్‌లో పలు రకాల ఎంజైమ్‌లు యాక్టివేట్ అయ్యేలా చేస్తాయి. ఇవి లివర్‌లో ఉండే వ్యర్థాలతోపాటు శరీరంలోని వ్యర్థాలను సులభంగా బయటకు పంపుతాయి. దీంతో లివర్ క్లీన్ అవుతుంది. రోజూ ఉదయాన్నే పరగడుపునే రెండు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. బ్రోకలీ, కాలిఫ్లవర్, క్యాబేజీ వంటి కూరగాయల్లో పలు సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి లివర్‌లో ఉండే వ్యర్థాలను బయటకు పంపే ఎంజైమ్‌లను తయారు చేస్తాయి. అందువల్ల ఈ కూరగాయలను తింటుంటే మేలు జరుగుతుంది. దీని వల్ల శరీరంలోని వ్యర్థాలు సైతం సులభంగా బయటకు వెళ్లిపోతాయి.

**ఆకుకూరలు..**

పాలకూర వంటి ఆకుకూరల్లో క్లోరోఫిల్ అనే సమ్మేళనం అధికంగా ఉంటుంది. ఇది లివర్‌తోపాటు రక్తంలో ఉండే వ్యర్థాలను బయటకు పంపించడంలో ఎంతో మెరుగ్గా పనిచేస్తుంది. టాక్సిన్ల వల్ల శరీరానికి నష్టం జరగకుండా చూస్తుంది. కనుక ఆకుకూరలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. దీని వల్ల లివర్ డ్యామేజ్ అవకుండా చూసుకోవచ్చు. పసుపును కూడా మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. అయితే వంటలలో వేసే పసుపు మన శరీరానికి చాలా స్వల్ప మోతాదులో లభిస్తుంది. కనుక దీన్ని నేరుగా అందేలా చూసుకోవాలి. అందుకు గాను గోరు వెచ్చని పాలలో లేదా నీటిలో కాస్త పసుపు కలిపి తాగాల్సి ఉంటుంది. ఇక పసుపులో ఉండే కర్క్యుమిన్ అనే సమ్మేళనం శక్తివంతమైన యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. ఇది లివర్ కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది.

**సిట్రస్ ఫలాలు..**

సిట్రస్ ఫలాలైన నిమ్మ, మోసంబి, నారింజ వంటి పండ్లలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి లివర్‌లో ఎంజైమ్ లు యాక్టివేట్ అయ్యేలా చేస్తాయి. దీని వల్ల ఈ ఎంజైమ్‌లు లివర్ లో ఉండే వ్యర్థాలను బయటకు పంపి లివర్ క్లీన్ అయ్యేలా చేస్తాయి. దీంతోపాటు శరీరంలోని టాక్సిన్లు సైతం బయటకు పోతాయి. ఆరోగ్యంగా ఉంటారు. అలాగే వాల్ నట్స్‌ను తింటున్నా లివర్ ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. వాల్ నట్స్‌లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి లివర్‌ను క్లీన్ చేయడంలో ఎంతో సహాయం చేస్తాయి. వాల్ నట్స్‌లో ఉండే ఆర్జినైన్, గ్లూటాథియోన్ అనే సమ్మేళనాలు లివర్ కణాలను రక్షిస్తాయి. దీంతో లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. రోజూ 2 కప్పుల గ్రీన్ టీని సేవిస్తున్నా కూడా లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. గ్రీన్ టీలో కాటెకిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి లివర్ కణాలను రక్షిస్తాయి. లివర్ శుభ్రం అయ్యేలా చేస్తాయి. కనుక గ్రీన్ టీని సేవిస్తుంటే ఉపయోగం ఉంటుంది. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల లివర్‌ను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై కొత్త అస్త్రం

**ఆశలు రేపుతున్న చైనా ఔషధం**


**ప్రమాదకరమైన స్మాల్-సెల్ లంగ్ క్యాన్సర్‌కు సరికొత్త చికిత్స**

**చైనా పరిశోధకుల ఆధ్వర్యంలో 4849 ఔషధంపై తొలి ప్రయోగాలు**

**దాదాపు 60 శాతం మందిలో వ్యాధిపై సానుకూల స్పందన**

**90 శాతానికి పైగా రోగులలో వ్యాధిని నియంత్రించినట్లు వెల్లడి**

**దుష్ప్రభావాలు కూడా తక్కువగానే ఉన్నట్టు తెలిపిన నిపుణులు**



ప్రమాదకరమైన ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులకు ఆశలు రేకెత్తించే ఓ కొత్త అధ్యయనం వెలుగులోకి వచ్చింది. అత్యంత వేగంగా వ్యాపించే స్మాల్-సెల్ లంగ్ క్యాన్సర్ చికిత్స కోసం చైనా పరిశోధకులు అభివృద్ధి చేసిన ఓ కొత్త యాంటీబాడీ ఔషధం తొలి దశ క్లినికల్ ట్రయల్స్‌లోనే అద్భుతమైన ఫలితాలను కనబరిచింది. ఈ వ్యాధికి పరిమిత చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఈ కొత్త ఆవిష్కరణ వైద్య ప్రపంచంలో సరికొత్త ఆశలను నింపుతోంది.చైనాలోని షాన్‌డాంగ్ ఫస్ట్ మెడికల్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ లిన్లిన్ వాంగ్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన నిర్వహించింది. 4849 అనే ఈ యాంటీబాడీ-డ్రగ్ కాంజుగేట్‌ను మొత్తం 54 మంది రోగులపై ప్రయోగించారు. క్యాన్సర్ కణాలపై ఉండే డీఎల్ఎల్3 అనే ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ఔషధాన్ని రూపొందించారు. పరిశీలనకు అర్హులైన 42 మంది రోగులలో ఈ ఔషధం దాదాపు 59.5 శాతం మందిలో క్యాన్సర్‌పై సానుకూలంగా స్పందించింది. అంతేకాకుండా, 90.5 శాతం మందిలో వ్యాధిని విజయవంతంగా నియంత్రించినట్లు పరిశోధకులు గుర్తించారు.ఈ అధ్యయనం ప్రకారం 2.4 మోతాదు తీసుకున్న రోగులలో స్పందన రేటు ఏకంగా 77.8 శాతంగా నమోదు కావడం గమనార్హం. ఈ ఔషధం వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు కూడా నియంత్రించగలిగే స్థాయిలోనే ఉన్నాయని పరిశోధకులు తెలిపారు. తెల్ల రక్త కణాల సంఖ్య తగ్గడం, రక్తహీనత, వికారం వంటి సాధారణ సమస్యలు కనిపించినప్పటికీ, వీటి కారణంగా ఎవరూ చికిత్సను మధ్యలో ఆపలేదని లేదా ప్రాణాపాయం కలగలేదని స్పష్టం చేశారు.ఈ ప్రోత్సాహకరమైన ఫలితాలను ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ లంగ్ క్యాన్సర్ 2025 ప్రపంచ సదస్సులో ప్రజెంట్ చేశారు. "ఈ ప్రాథమిక ఫలితాలు మాకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నాయి. డీఎల్ఎల్3 పాజిటివ్ స్మాల్-సెల్ లంగ్ క్యాన్సర్ రోగులకు మంచి చికిత్సా విధానంగా మారే అవకాశం ఉంది" అని డాక్టర్ వాంగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఫేజ్ 2 ప్రయోగాలకు అవసరమైన మోతాదును నిర్ధారించే పనిలో ఉన్నామని, త్వరలోనే దీనిపై మరింత స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు.

# క్యాన్సర్‌ను ఎదుర్కొనే టీకాను అభివృద్ధి చేసిన రష్యా

**ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ ఆధారంగా 'ఎంటర్‌మిక్స్' టీకా తయారీ**

**క్యాన్సర్ కణితుల పెరుగుదలను 80 శాతం వరకు తగ్గించినట్టు వెల్లడి**

**తొలుత పెద్దప్రేగు క్యాన్సర్‌పై ప్రధానంగా దృష్టి**

**మెదడు, చర్మ క్యాన్సర్లకు కూడా టీకాలపై పరిశోధనలు**




ప్రాణాంతక క్యాన్సర్ మహమ్మారి చికిత్సలో సరికొత్త ఆశలు రేకెత్తిస్తూ రష్యా శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు ఒక సరికొత్త వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశామని, అది ప్రస్తుతం వాడుకకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. రష్యాకు చెందిన ఫెడరల్ మెడికల్ అండ్ బయోలాజికల్ ఏజెన్సీ (ఎఫ్ఎంబీఏ) ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది.'ఎంటర్‌మిక్స్' అని పేరు పెట్టిన ఈ వ్యాక్సిన్‌పై ఏళ్ల తరబడి పరిశోధనలు నిర్వహించినట్టు ఎఫ్ఎంబీఏ అధిపతి వెరోనికా స్క్వోర్త్సోవా తెలిపారు. మూడేళ్ల పాటు జరిపిన ప్రీ-క్లినికల్ ప్రయోగాల్లో ఈ టీకా అద్భుతమైన ఫలితాలను ఇచ్చినట్టు ఆమె వివరించారు. ఈ వ్యాక్సిన్ అత్యంత సురక్షితమని, ఎంతో సమర్థవంతంగా పనిచేసిందని చెప్పారు. కొన్ని రకాల క్యాన్సర్లలో కణితుల పెరుగుదలను 60 శాతం నుంచి 80 శాతం వరకు తగ్గించిందని, ప్రయోగాలకు గురైన జీవుల మనుగడ రేటు కూడా గణనీయంగా మెరుగుపడిందని ఆమె పేర్కొన్నారు.కరోనా మహమ్మారి సమయంలో కొన్ని వ్యాక్సిన్లలో ఉపయోగించిన ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీనే ఈ క్యాన్సర్ టీకాలోనూ వినియోగించడం గమనార్హం. ఈ టెక్నాలజీ ద్వారా శరీరంలోని కణాలకు క్యాన్సర్ కణాలపై దాడి చేసేలా రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించే ప్రోటీన్లను తయారు చేసేలా శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్‌ను తొలుత పెద్దప్రేగు క్యాన్సర్ చికిత్స కోసం అందుబాటులోకి తీసుకురానున్నారు. దీనితో పాటు వేగంగా వ్యాపించే మెదడు క్యాన్సర్ (గ్లయోబ్లాస్టోమా), కంటి క్యాన్సర్ సహా కొన్ని రకాల చర్మ క్యాన్సర్లకు (మెలనోమా) కూడా వ్యాక్సిన్లను అభివృద్ధి చేసే పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

# జలుబు త్వరగా తగ్గాలంటే...



ఆఫీసులకు వెళ్ళేటప్పుడు, ఆఫీసుల నుండి ఇళ్ళకు వచ్చేటప్పుడు వర్షాలు సడెన్ గా దాడి చేస్తున్నాయి. దానివల్ల తడవకుండా గమ్యం చేరుకోవడం కష్టమే. కొద్దిగా తడిచినా, వెంటనే జలుబు పట్టేస్తుంది. జలుబు రావడానికి ఎక్కువ సమయం అక్కర్లేదు గానీ, తగ్గడానికి మాత్రం చాలా టైం తీసుకుంటుంది. అంత తేలికగా వదలదు. జలుబు రాకుండా, లేదా త్వరగా వదిలేందుకు కొన్ని జాగ్రత్తలు, చిట్కాలు పాటిస్తే త్వరగా ఉపశమనం పొందొచ్చు.చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి, ఏ తిండి పదార్థాన్ని వస్తువులను తాకినా అదే చేత్తో ముక్కు తుడుచుకోవడం వల్ల జలుబు తీవ్రత అధికమవుతుంది. గుంపులలో, లేదా దుమ్ము, ధూళి వాతావరణం, లేదా ఏసీలో ఉండడం వల్ల కూడా జలుబు తీవ్రమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో మామూలు నీళ్ళు, చల్లటి నీళ్ళ కంటే, గోరు వెచ్చని నీళ్లు తాగడం మంచిది. జలుబు వల్ల ఏర్పడిన గొంతు గరగర, చిరాకు కాస్త ఉపశమిస్తుంది.ఏసీలో, లేదా చల్లని వాతావరణంలో తప్పనిసరిగా ఉండవలసి వస్తే మాస్క్ వాడడం మంచిది. దానివల్ల దగ్గు, తుమ్ము సమయంలో మనద్వారా జలుబు వ్యాప్తి తగ్గుతుంది. మనకు కూడా ఆల్రెడీ ఉన్న జలుబుకి తోడు బయటి నుంచి వచ్చి నేరుగా ముక్కుపుటాల్లోకి వెళ్ళే గాలి తీవ్రత చిరాకు కలిగిస్తుంది. మనం ఉండే పరిసరాల్లో గాలి బాగా వచ్చేలా ఉండాలి. తలుపులు, కిటికీలు మూసేసీ, ఫ్యాన్లు ఆఫ్ చేసి ఉండొద్దు.జ్వరం వచ్చినప్పటి లాగా నోరు చేదుగా ఉండకపోయినా, ఏదీ తినాలనిపించక, ఏది చూసినా వెగటుగా అనిపిస్తుంది జలుబు వల్ల. అందుకని, వేపుళ్ళు, జంక్ ఫుడ్ లాంటి వాటి జోలికి అస్సలు పోవద్దు. చక్కటి ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే తీసుకోవాలి. ఉదాహరణకు విటమిన్ సి (నారింజ, ఉసిరి), ప్రోటీన్లు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. అన్నిటికన్న ముఖ్యమైనది, శరీరానికి తగినంత విశ్రాంతినివ్వాలి. అప్పుడే శరీరం వైరస్‌తో పోరాడటానికి శక్తి పొందుతుంది. అప్పుడప్పుడు వేడి ఆవిరి పీల్చడం ఉపశమనం కలిగిస్తుంది. వేడి నీటిలో కాస్త ఉప్పు వేసి గొంతులో దాకా పోనిచ్చి బయటికి వదిలేయాలి. దాని ద్వారా జలుబు వల్ల గొంతులో కలిగే అనీజీనెస్ తగ్గుతుంది.

**చల్లటి పదార్థాలు, ఐస్ క్రీమ్, గ్యాస్ డ్రింక్స్ జోలికి అస్సలు పోవద్దు**

త్వరగా జలుబు తగ్గాలని చాలామంది చేసే పెద్ద పొరపాటు, యాంటి బయాటిక్స్ వాడడం. దాని ద్వారా తాత్కాలిక ఉపశమనం కలిగించినా, తరచుగా యాంటి బయాటిక్స్ వాడడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు కలుగుతాయో చెప్పలేం. అందువల్ల డాక్టర్ సలహా లేకుండా యాంటీబయోటిక్స్ వాడకూడదు.

# దేశంలో ఎవరెందుకు చనిపోతున్నారో తెలుసా..

హృదయ సంబంధిత వ్యాధుల వల్లే దేశంలో ఎక్కువ మంది చనిపోతున్నారని మీకు తెలుసా..? దాదాపు 31 శాతం మరణాలకు ఇవే ప్రధాన కారణమట. భారత రిజిస్ట్రార్ జనరల్ ఆధ్వర్యంలోని హృదయ సంబంధిత వ్యాధుల వల్లే దేశంలో ఎక్కువ మంది చనిపోతున్నారని మీకు తెలుసా..? దాదాపు 31 శాతం మరణాలకు ఇవే ప్రధాన కారణమట. భారత రిజిస్ట్రార్ జనరల్ ఆధ్వర్యంలోని మోడల్ రిజిస్ట్రేషన్ సర్వే సమర్పించిన తాజా డేటా ప్రకారం పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. మరణ కారణాలపై వచ్చిన తాజా నివేదిక(2021-2023)లో దేశంలో అధిక మరణాలకు నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు ప్రధాన కారణాలని తెలిపింది. మొత్తం మరణాలలో 56.7 శాతం వీటివల్లే సంభవిస్తున్నాయని వెల్లడించింది.సంక్రమిత, ప్రసూతి, పెరినాటల్, పోషకాహారలోపం వల్ల 23.4 శాతం మరణాలు కలుగుతున్నాయని సదరు నివేదిక చెబుతోంది. 2020-2022 కాలంలో సంబంధిత మరణాలు వరుసగా 55.7 శాతం, 24.0 శాతంగా ఉన్నాయని తెలిపింది.హృదయ సంబంధ వ్యాధులే అధిక మరణాలకి ప్రధాన కారణంగా ఉన్నాయని చెప్పిన నివేదిక.. దాదాపు 31 శాతం మంది ఈ కారణంగా చనిపోతే, తరువాత 9.3 శాతం మంది శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, 6.4 శాతం మంది ప్రాణాంతక, ఇతర నియోప్లాజమ్‌లు, 5.7 శాతం మంది శ్వాసకోశ వ్యాధులు కారణంగా ప్రాణాలు కోల్పోయారని చెప్పింది.29-30 ఏళ్ల వయస్కులు.. వాళ్ల జీవనశైలి కారణంగా హృదయ సంబంధ వ్యాధులకు గురై చనిపోతున్నారని సదరు నివేదిక చెబుతోంది. ఇక, 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల వారిలో మరణానికి అత్యంత సాధారణ కారణం ఆత్మహత్యలు.. తదితరాలని పేర్కొంది.ఇక, ఈ నివేదిక ప్రకారం మరణాలకి ఇతర కారణాలలో జీర్ణకోశ వ్యాధులు 5.3 శాతం, జ్వరాల కారణంగా 4.9 శాతం, ప్రమాదాల బారినపడి 3.7 శాతం, డయాబెటిస్ మెల్లిటస్ కారణంగా 3.5 శాతం, జెనిటూరినరీ వ్యాధుల కారణంగా 3.0 శాతం మంది చనిపోతున్నట్టు సదరు నివేదిక వెల్లడించింది. 10.5 శాతం మరణాలు వృద్ధాప్యం(70 ఏళ్లు, లేదా అంతకంటే ఎక్కువ) కారణంగా సంభవిస్తున్నాయని సదరు నివేదికలు చెబుతున్నాయి.



# రూ.1,60,000 దిగువకు బంగారం, రూ.30 వేలు తగ్గిన వెండి ధర

**ఒక్కరోజులోనే రూ.30వేలు తగ్గిన వెండి**

**భారీగా తగ్గిన వెండి, బంగారం ధరలు**

**24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,59,680**

**కిలో వెండి ధర రూ.2,69,000**





గత కొన్ని రోజులుగా పెరుగుతున్న బంగారం, వెండి ధరలు గురువారం తగ్గాయి. దేశీయ మార్కెట్‌లో ధరలు గురువారం కాస్త దిగొచ్చాయి. ముఖ్యంగా వెండి బుధవారంతో పోలిస్తే దాదాపు రూ.30 వేల మేర తగ్గింది. కిలో వెండి ధర రూ.2,69,000గా ఉంది. ఇక 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.6,600 తగ్గి రూ.1,59,680కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాములు ధర రూ.1,41,550గా ఉంది.

హైదరాబాద్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.1,59,680గా ఉంది. కిలో వెండి ధర రూ.2,69,00గా ఉంది.

విజయవాడలో 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,680గా ఉంది. కిలో వెండి ధర రూ. 2,69,00గా ఉంది.

విశాఖపట్నంలో పది గ్రాముల పుత్తడి ధర రూ.1,59,680గా ఉంది. కిలో వెండి ధర రూ.2,69,00గా ఉంది.

ప్రొద్దుటూరులో 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,680గా ఉంది. కిలో వెండి ధర రూ.2,69,00గా ఉంది.

**అంతర్జాతీయ మార్కెట్‌లోనూ**

అంతర్జాతీయంగానూ ధరలు తగ్గుముఖం పట్టాయి. ఔన్సు బంగారం ధర 4919 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 79 డాలర్లుగా కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో డెలివరీ కాంట్రాక్టుకు వెండి దాదాపు 7 శాతం పడిపోయింది. కిలో ధర రూ.2.49 లక్షల వద్ద ఉంది. ఏప్రిల్ డెలివరీలకు పసిడి ధర స్వల్పంగా పెరిగి 10 గ్రాముల ధర రూ.1.53 లక్షలకు చేరింది.బుధవారం బంగారం, వెండి ధరలు పెరిగాయి. ఇటీవల యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పెరిగాయి. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడం వల్ల వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ధరల్లో హెచ్చుతగ్గులు**

అయితే వెండి ధరల్లోని ఈ హెచ్చుతగ్గులపై 'ఆల్ ఇండియా జ్యువెల్లర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్' జాతీయ అధ్యక్షుడు పంకజ్ అరోరా ఇటీవల స్పందించారు. గత 15 రోజుల్లోనే వెండి ధర రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు పెరిగిందని అన్నారు. ఇంత వేగంగా, ఒకే దిశలో పెరగడం ఎప్పుడూ నిలకడగా ఉండదని తెలిపారు. అందుకే ఇప్పుడు ఈ హెచ్చుతగ్గులు అని చెప్పారు. అమెరికా వెండిని 'క్రిటికల్ మినరల్'గా గుర్తించడం, చైనా ఎగుమతులను నియంత్రించడంతో డిమాండ్ పెరిగిందని అన్నారు. అయితే ఎక్స్ఛేంజీలలో జరిగే 'పేపర్ ట్రేడ్' వల్ల ధరల్లో ఇంత అస్థిరత వస్తోందని అన్నారు.

**కొనుగోలుదార్లు జర జాగ్రత్త**

బంగారం, వెండి ధరలు రోజుల నుంచి నిమిషాల వ్యవధిలో మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆభరణాల విక్రయదారులు ధరలను మార్చివేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ధరలు ప్రకారమే నగదును వసూలు చేస్తున్నారు. కానీ ధరలు తగ్గినపుడు కొంతమంది వ్యాపారులు తగ్గింపును చూపడం లేదని కొనుగోలుదారులు అంటున్నారు. పెరిగిన ధరలనే చూపిస్తున్నారంటూ చెబుతున్నారు. నగలు కొనడానకి వెళ్లినప్పుడు ధరలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవడం మంచింది.999 ప్యూరిటి బంగారం ధర 92 శాతం వెచ్చిస్తే, వచ్చేదే 22 క్యారెట్ల బంగారం ధర. విక్రయదారులు చూపించే 24 క్యారెట్ల బంగారం ధరలో జీఎస్‌టీ కలిపి ఉంటుంది. అప్పుడు మళ్లీ ఆభరణాన్ని విక్రయించేటపుడు బంగారంపై జీఎస్‌టీను చూయించరాదు. ఆన్‌లైన్‌లో కంటే తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెబితే అందులో జీఎస్‌టీ లేదని అర్ధం. బిల్లు వేసేటప్పుడు అందులో 3 శాతం జీఎస్‌టీని కలుపుతారు.

# భారత్‌పై ప్రపంచం దృష్టి- స్థిరమైన నాయకత్వం, పటిష్టమైన వృద్ధే ఇందుకు కారణం

**ముకేశ్ అంబానీ**

**భారత ఆర్థిక వ్యవస్థ పండ్లు ఇచ్చే చెట్టు**

**ఇది సహజంగానే అందరి దృష్టిని ఆకర్షిస్తుంది**

**బ్లాక్‌రాక్ సీఈఓతో ముకేశ్ అంబానీ**




భారత్ తన బలమైన ఆర్థిక వృద్ధి, స్థిరమైన నాయకత్వం, నిలకడైన విధానాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ అన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థను పండ్లు ఇచ్చే చెట్టుగా అభివర్ణించిన ఆయన, ఇది సహజంగానే అందరినీ ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న బ్లాక్‌రాక్ ఛైర్మన్ అండ్ సీఈఓ లారీ ఫింక్‌తో మాట్లాడుతూ, భారత్ ఆర్థిక వృద్ధి గురించి ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు."భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ. భారత్ 8-10 శాతం వృద్ధి రేటును సాధించడం, దాన్ని నిలబెట్టుకోవడం కూడా సాధ్యమే. భారతదేశంలో ఒక పాత సామెత ఉంది. పండ్లు కాసే చెట్టు మాత్రమే అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. నేడు భారత ఆర్థిక వ్యవస్థ అనే గొప్ప వృక్షం స్థిరత్వంతో, సమృద్ధిగా పండ్లను ఇస్తోంది. అందుకే చాలా కాలం తరువాత భారత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది."

**మోదీకి కృతజ్ఞతలు**

గత 10-15 ఏళ్లుగా భారత్‌లో స్థిరమైన నాయకత్వం ఉందని, అది కూడా భారత్‌పై ప్రపంచ దేశాల దృష్టి పెరగడానికి ప్రధాన కారణమని అంబానీ అభిప్రాయపడ్డారు. దేశ పురోగతిలో ఆర్థిక స్థిరత్వం నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా పాలనలో నిలకడ, స్పష్టతను అందించిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రభుత్వ దీర్ఘకాలిక దార్శనికతను అంబానీ స్వాగతించారు. 'వికసిత్ భారత్' లక్ష్యం దేశ పౌరుల్లో విస్తృత ఆమోదాన్ని, నమ్మకాన్ని పొందిందని ఆయన అన్నారు. దేశంలో రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు, టెలికమ్యునికేషన్స్, ఇతర రంగాల్లలో జరిగిన అభివృద్ధిని ముకేశ్ అంబానీ ఉదహరించారు. భారీ ప్రాజెక్టులను చేపట్టగల సామర్థ్యం భారత్‌కు ఉందని, ఇదే వృద్ధికి కీలక కారకంగా ఉంటుందని అన్నారు. "స్థిరమైన నాయకత్వం ఒక దేశాన్ని నిర్వచిస్తుంది. మనకు స్థిరత్వాన్ని అందించిన మోదీకి మనం కృతజ్ఞతలు చెప్పాలి. మనకు 2047 నాటికి వికసిత్ భారత్ కావాలనే స్పష్టమైన లక్ష్యం ఉంది. దీనిని ప్రతి భారతీయుడు ఆకాంక్షిస్తున్నారు. విశ్వసిస్తున్నారు."

**ది ఎరా ఆఫ్ ఇండియా**

ఈ సందర్భంగా భారత్ గురించి బ్లాక్‌రాక్ సీఈఓ లారీ ఫింక్ కీలక వ్యాఖ్యలు చేశారు. "నేను భారత దేశాన్ని ఒక రోజు, ఒక వారం లేదా ఒక సంవత్సరం అనే దృక్పథంతో కాకుండా, సుదీర్ఘకాల పరిమితిలో చూస్తాను. రానున్న 20-25 ఏళ్లు 'ఇండియన్ ఎరా'గా ఉంటుంది. ఈ 'భారత యుగం' అంటే అంటే ఏమిటో, అందులో ప్రజలు ఎలా భాగస్వాములు కావచ్చో మరింత మందికి అర్థమయ్యేలా చూడడమే జియా బ్లాక్‌రాక్ ముఖ్య ఉద్దేశం." అని బ్లాక్‌రాక్ సీఈఓ లారీ ఫింక్ అన్నారు. అయితే పెట్టుబడిదారుడిగా తాను ఏ ఒక్క యుగాన్ని మాత్రమే చూడనని, జీవితకాలంలో పెట్టుబడిదారులకు ఉండే నిజమైన అవకాశాలపై మాత్రమే దృష్టి పెడతానని లారీ ఫింక్ స్పష్టం చేశారు. భారత ప్రజలు తమ పొదుపు, పదవీ విరమణ నిధులను పెట్టుబడిగా పెట్టడం ద్వారా దేశ వృద్ధి మరింతగా పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**జియో బ్లాక్‌రాక్**

జియో బ్లాక్‌రాక్ బ్రోకింగ్ సంస్థ- భారతీయ పెట్టుబడిదారులకు తక్కువ ఖర్చుతో, పారదర్శకమైన, అధునాత సాంకేతికతతో కూడిన సేవలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. దీని మాతృ సంస్థ 'జియా బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్'. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, బ్లాక్‌రాక్ ఇంక్‌ల మధ్య ఇది 50:50 పర్సెంట్ జాయింట్ వెంచర్‌గా ఉంది.


# ఎప్ స్టీన్ తో స్నేహంపై బిల్ గేట్స్ ఏమన్నారంటే..!

**ఆరోపణలపై తొలిసారి స్పందించిన ప్రపంచ కుబేరుడు**

**ఆయనతో కలిసి గడిపినందుకు చింతిస్తున్నట్లు వెల్లడి**

**అందుకు క్షమాపణలు కోరుతున్నానని బిల్ గేట్స్ వ్యాఖ్య**





మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుడు బిల్ గేట్స్ తనపై వచ్చిన ఆరోపణల విషయంలో తొలిసారి స్పందించారు. జెఫ్రీ ఎప్ స్టీన్ తో స్నేహంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఎప్ స్టీన్ తో కలిసి గడిపిన ప్రతీ నిమిషం పట్ల ఇప్పుడు చింతిస్తున్నానని, క్షమాపణలు కోరుతున్నానని వ్యాఖ్యానించారు. అతడితో తాను స్నేహం చేసి ఉండకూడదని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆస్ట్రేలియా మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయంపై మాట్లాడారు. అయితే, ఎప్ స్టీన్ ఫైల్స్ లో బయటపడ్డ ఈమెయిల్ మాత్రం నిజం కాదని, ఏ ఉద్దేశంతో ఎప్ స్టీన్ ఆ మెయిల్ ను రాశాడో తెలియదని బిల్ గేట్స్ చెప్పారు.ఆ మెయిల్ కూడా ఎవరికీ పంపలేదనే విషయాన్ని గుర్తుచేశారు. 'రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాల వల్ల బిల్ గేట్స్ కు సుఖవ్యాధులు సోకాయి. ఈ విషయం ఆయన భార్యకు తెలియకుండా ఉండేందుకు మందులు కావాలని కోరాడు. ఆయన కోరినట్లే మందులు ఇప్పించాను' అంటూ ఎప్ స్టీన్ ఓ ఈమెయిల్ లో పేర్కొన్నాడు. దానిని ఎవరికీ పంపకుండా డ్రాఫ్ట్ బాక్స్ లో సేవ్ చేసి పెట్టుకున్నాడు. తాజాగా ఈ ఈమెయిల్ బయటపడింది.అంతకుముందు బిల్ గేట్స్ మాజీ భార్య మిలిందా ఓ పోడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. బిల్ గేట్స్ తో విడాకులకు ఎప్ స్టీన్ తో ఆయనకు ఉన్న స్నేహమే కారణమని చెప్పారు. ఎప్ స్టీన్ ఫైల్స్ లో తాజాగా మరోమారు బిల్ గేట్స్ పేరు బయటకు రావడం, బిల్ గేట్స్ కు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై మిలిందా స్పందించారు. ఈ విషయంపై జవాబు చెప్పుకోవాల్సిన బాధ్యత బిల్ గేట్స్ కే ఉందని ఆమె వ్యాఖ్యానించారు. మిలిందా ఇంటర్వ్యూ ప్రసారమైన తర్వాత బిల్ గేట్స్ ఇంటర్వ్యూ వెలువడడం గమనార్హం.

# టెక్కీలకు శుభవార్త.. 25 వేల మంది ఫ్రెషర్ల నియామకానికి కాగ్నిజెంట్ ప్లాన్!

**గతేడాదితో పోలిస్తే నియామకాల్లో 20 శాతం వృద్ధి**

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెరిగిన ఉత్పాదకత**

**19 శాతం పెరిగిన నికర లాభం; జోరుగా కంపెనీ వృద్ధి**




ఐటీ రంగంలో ఉద్యోగాల కోతపై ఆందోళనలు నెలకొన్న తరుణంలో ప్రముఖ దిగ్గజం కాగ్నిజెంట్ నిరుద్యోగులకు తీపి కబురు అందించింది. 2026 ఏడాదిలో సుమారు 24,000 నుంచి 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇది గత ఏడాదితో (20,000 నియామకాలు) పోలిస్తే 20 శాతం అధికం కావడం విశేషం. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ను మరింత వేగవంతం చేస్తూ, కంపెనీ తన టాలెంట్ పిరమిడ్‌ను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించింది.సాధారణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలు పోతాయనే వాదనలు వినిపిస్తుంటాయి. అయితే, కాగ్నిజెంట్ దీనిని మరో కోణంలో చూస్తోంది. జెమిని, ఓపెన్ ఏఐ వంటి ప్లాట్‌ఫారమ్‌లతో జతకట్టి ఏఐ టూల్స్ ద్వారా ఎంట్రీ లెవల్ ఉద్యోగుల ఉత్పాదకతను పెంచుతున్నామని సీఈఓ రవి కుమార్ వెల్లడించారు. ఏఐ సహాయంతో కొత్త ఇంజనీర్లు గతంలో కంటే వేగంగా క్లయింట్ ప్రాజెక్టుల్లో భాగస్వాములు అవుతున్నారని, అందుకే ఫ్రెషర్ల నియామకాన్ని పెంచుతున్నామని కంపెనీ స్పష్టం చేసింది.ఆర్థిక ఫలితాల పరంగానూ కాగ్నిజెంట్ అదరగొట్టింది. 2025 డిసెంబరుతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 18.7 శాతం వృద్ధి చెంది 64.8 కోట్ల డాలర్లకు చేరింది. సెప్టెంబర్ నాటితో పోలిస్తే డిసెంబర్ నాటికి ఉద్యోగుల సంఖ్య 1,800 పెరిగి మొత్తం 3.51 లక్షలకు చేరుకుంది. కేవలం మనుషుల శ్రమతోనే కాకుండా, డిజిటల్ లేబర్‌ను కూడా జోడించి 2026లో 2,266 కోట్ల డాలర్ల ఆదాయమే లక్ష్యంగా కాగ్నిజెంట్ ముందుకు సాగుతోంది. ఐటీ రంగం మందగమనంలో ఉందన్న వార్తల మధ్య కాగ్నిజెంట్ తీసుకున్న ఈ నిర్ణయం నిరుద్యోగ యువతలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

# తగ్గిన జోరు... ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**స్టాక్ మార్కెట్ల రెండు రోజుల లాభాలకు బ్రేక్**

**ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి**

**కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంపై పెరిగిన ఆందోళనలు**

**స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ**

**భారీ నష్టాలను చవిచూసిన ఇన్ఫోసిస్, టీసీఎస్**



దేశీయ స్టాక్ మార్కెట్లలో రెండు రోజుల లాభాలకు బుధవారం బ్రేక్ పడింది. ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో సూచీలు దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 78.56 పాయింట్ల స్వల్ప లాభంతో 83,817.69 వద్ద, నిఫ్టీ 48.45 పాయింట్లు పెరిగి 25,776.00 వద్ద స్థిరపడ్డాయి.కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీలో వేగంగా వస్తున్న పురోగతిపై నెలకొన్న కొత్త ఆందోళనలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ న్యాయవాదుల కోసం ఒక కొత్త టూల్‌ను ప్రారంభించడమే ఇందుకు కారణం. ఇలాంటి ఏఐ టూల్స్ వేగంగా అభివృద్ధి చెందడం వల్ల సంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవలకు డిమాండ్ తగ్గి, ఐటీ పరిశ్రమ లాభదాయకత దెబ్బతినవచ్చని ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభావంతోనే నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 6 శాతం కుప్పకూలింది.సెన్సెక్స్ స్టాక్స్‌లో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధాన నష్టాల్లో ముగిశాయి. యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు కూడా నష్టపోయాయి. మరోవైపు, ఎటర్నల్, ట్రెంట్, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, ఐటీతో పాటు ఫార్మా ఇండెక్స్ కూడా 0.34 శాతం నష్టపోయింది. అయితే, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 2.6 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 2 శాతం పెరిగి మార్కెట్లకు మద్దతునిచ్చాయి.ప్రధాన సూచీలు ఫ్లాట్‌గా ఉన్నప్పటికీ, బ్రాడర్ మార్కెట్‌లో సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.27 శాతం లాభపడ్డాయి. నిపుణుల ప్రకారం, నిఫ్టీ రోజంతా 25,680 – 25,820 మధ్య పరిమిత శ్రేణిలో కదలాడింది. 25,800 స్థాయిని దాటితేనే సూచీలో మరింత సానుకూలత రావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆర్‌బీఐ మానిటరీ పాలసీ.. వడ్డీ రేట్లు యథాతథం?



ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, మారుతున్న ద్రవ్యోల్బణ గణాంకాలు, దేశీయ బాండ్ మార్కెట్ ఒత్తిళ్ల మధ్య ఆర్‌బీఐ తన ఫిబ్రవరి పాలసీలో వడ్డీ రేట్లను మార్చకపోవచ్చని తెలుస్తోంది. గతేడాది నుంచి దేశీయంగా వడ్డీ రేట్లు తగ్గుతున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు జరిగే ఆర్‌బీఐ మానిటరీ సమావేశంలోని అంశాలు రేపు ఉదయం వెలువడనున్నాయి.

**అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు**

గత పాలసీ సమావేశం తర్వాత జరిగిన అతిపెద్ద పరిణామం భారత్-అమెరికా, భారత్-యూరప్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాలు. దీని ఫలితంగా భారతీయ వస్తువులపై సుంకాలు గతంలో ఉన్న 50% నుంచి 18%కి గణనీయంగా తగ్గాయి. ప్రస్తుతం ఆసియా దేశాల్లోనే అతి తక్కువ టారిఫ్ రేట్లు కలిగిన దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచింది. ఇది మన ఎగుమతిదారుల పోటీతత్వాన్ని భారీగా పెంచనుంది.

**ప్రపంచ ఆర్థిక అనిశ్చితి**

అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు ఇంకా సందిగ్ధంలోనే ఉన్నాయి. 'జియో-ఎకనామిక్స్ స్ట్రెస్ ఇండెక్స్' ప్రకారం అంతర్జాతీయ అనిశ్చితి పెరిగిన 3-4 నెలల తర్వాత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం కనిపిస్తుంది. మరోవైపు గత వారం భారీ పతనాన్ని చూసిన లోహాల ధరలు తిరిగి కోలుకోవడం గమనార్హం.

**అమెరికా ఫెడ్ రేట్ల కోత సంకేతాలు**

అమెరికాలో లేబర్ మార్కెట్ మందగించడం, వాస్తవ ఆదాయం స్థిరంగా ఉండటం, ద్రవ్యోల్బణ ప్రభావం తగ్గడంతో.. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించే దిశగా అడుగులు వేస్తోంది. ఇది ప్రపంచ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

**రూపాయి ఒడిదుడుకులు**

గత రెండు నెలలుగా రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రూ.89-92 మధ్య ఊగిసలాడుతోంది. ఏప్రిల్ 2025లో అమెరికా సుంకాలను పెంచినప్పటి నుంచి రూపాయి 5.8% మేర క్షీణించింది. అయితే ఇటీవలి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తర్వాత రూపాయి విలువ కోలుకోవడం సానుకూలాంశం.

**ద్రవ్యోల్బణం**

ద్రవ్యోల్బణ గణనలో భాగంగా కొత్త సీపీఐ వెయిటేజీలను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం సాధారణ సమయంలో ద్రవ్యోల్బణం 20-30 బేసిస్ పాయింట్లు పెరిగే అవకాశం ఉండగా.. ఆహార ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న నెలల్లో మాత్రం కొత్త లెక్కల ప్రకారం సీపీఐ 20-30 బేసిస్ పాయింట్లు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది.పైన పేర్కొన్న మిశ్రమ పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని కమిటీ ప్రస్తుతానికి కీలక వడ్డీరేట్ల మార్పులపై వేచి చూసే ధోరణిని అవలంబిస్తుదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఐటీ పెట్టుబడిదారుల్లో ఆందోళన




కృత్రిమ మేధ (ఏఐ) విభాగంలో ఆంత్రోపిక్ సంస్థ తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పు భారత ఐటీ రంగాన్ని వణికిస్తోంది. ఆంత్రోపిక్ తన 'క్లాడ్ కోవర్క్' ఏజెంట్ కోసం సరికొత్త ఆటోమేషన్ ప్లగ్ఇన్‌లను విడుదల చేసింది. దాంతో శ్రమ ఆధారిత సర్వీసుల పై ఆధారపడిన భారత ఐటీ కంపెనీల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పరిణామం ఫలితంగా స్టాక్ మార్కెట్‌లో ఇటీవల ఐటీ షేర్లు భారీగా కుప్పకూలాయి.

**ఐటీ రంగానికి సవాలు..**

ఆంత్రోపిక్ విడుదల చేసిన కొత్త ప్లగ్ఇన్‌లు కేవలం సాధారణ చాటింగ్ కోసం మాత్రమే కాదు, ఒక సంస్థలోని కీలక విభాగాలను స్వయంచాలకంగా నిర్వహించేలా రూపొందించారు. వీటి ప్రభావం ప్రధానంగా కింది విభాగాలపై ఉండనుంది.లీగల్, ఫైనాన్స్: కాంట్రాక్ట్ రివ్యూ, కంప్లయన్స్ వంటి సంక్లిష్ట ప్రక్రియలను ఏఐ వేగంగా పూర్తి చేస్తుంది.కస్టమర్ సపోర్ట్: టికెట్ల వర్గీకరణ, సమాధానాలు ఇవ్వడం.. వంటి అంశాలపై మనుషుల ప్రమేయం లేకుండానే సమస్యల పరిష్కారాన్ని క్లాడ్ నిర్వహిస్తుంది.సేల్స్, మార్కెటింగ్ వ్యూహాలను రూపొందించి వాటిని సమర్థంగా అమలు చేస్తుంది.ఎంటర్‌ప్రైజ్ సెర్చ్: ఒక కంపెనీలోని ఈ-మెయిల్‌లు, క్లౌడ్ స్టోరేజ్, చాట్ డేటాను విశ్లేషించి నివేదికలు తయారు చేస్తుంది.ఇప్పటివరకు 'సాస్' ఆధారిత సర్వీసుల ద్వారా పై పనులను నిర్వహించేవారు. ఏదైనా సాఫ్ట్‌వేర్‌ను మన కంప్యూటర్ లేదా ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోకుండా, నేరుగా ఇంటర్నెట్ ద్వారా వాడుకోవడాన్ని సాస్ అంటారు. ఇప్పుడు చర్చల్లో ఉన్న క్లాడ్ కోవర్క్ వంటి ఏఐ సాధనాలు వస్తే భవిష్యత్తులో సాప్ వంటి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ల అవసరం లేకుండా ఏఐతోనే పనులు చేయిస్తారని ఇన్వెస్టర్లు భయపడుతున్నారు.




## ‘బుల్లెట్ సునీల్’గా రాజశేఖర్ రీ ఎంట్రీ
## ‘బైకర్’ గ్లింప్స్‌తో ఫ్యాన్స్‌లో జోష్

ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ‘బైకర్’ సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది.ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన ‘బుల్లెట్ సునీల్’ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది.గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. “ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది” అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో ‘బైకర్’ మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి. సెకండ్ ఇన్నింగ్స్‌లో రాజశేఖర్ ఎలాంటి పాత్రలు ఎంచుకుంటారన్న ఆసక్తి ప్రేక్షకుల్లో ఎప్పటినుంచో ఉంది. ‘బుల్లెట్ సునీల్’ గ్లింప్స్‌తో ఆయన మళ్లీ పవర్‌ఫుల్ పాత్రలతో అలరించబోతున్నారని సంకేతాలు రావడంతో, ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో మలుపు తిప్పే అవకాశం ఉందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రియల్ స్టోరీ మారెమ్మ.. టీజర్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు మాధవ్ భూపతిరాజు హీరోగా వస్తోన్న తాజా చిత్రం మారెమ్మ. ఈ సినిమాకు మంచాల నాగరాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ యధార్థ సంఘటనల ఆధారంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సినిమాలో దీపా బాలు హీరోయిన్‌గా కనిపించనున్నారు. తాజాగా విడుదలైన టీజర్ చూస్తుంటే గ్రామీణ నేపథ్యంలో సాగే రియల్ స్టోరీగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఊరికి శాపం చుట్టుకోవడంతో గ్రామ దేవత మారెమ్మకు పూజలు చేయడం టీజర్‌లో చూపించారు. ఈ చిత్రాన్ని మోక్ష ఆర్ట్స్ పతాకంపై మయూర్ రెడ్డి బండారు నిర్మించారు. ఈ సినిమాలో వినోద్ కుమార్, వీఎస్ రూపా లక్ష్మి, దయానంద్ రెడ్డి కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీకి ప్రశాంత్ ఆర్.విహారి సంగీతమందిస్తున్నారు.

## మెగా 158 అప్‌డేట్: చిరంజీవి సినిమాలో ‘ధురంధర్’ హీరోయిన్



మన శంకర వర ప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం ‘పొన్నియిన్ సెల్వన్’ ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రోడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

## ‘అమరన్’ దర్శకుడితో ధనుష్.. కీలక పాత్రలో మమ్ముట్టి



తమిళ స్టార్ హీరో ధనుష్ తన 55వ సినిమాను (డి55) ‘అమరన్’ దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి ఒక అదిరిపోయే అప్‌డేట్ వెలుబడింది. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ధనుష్ మరియు మమ్ముట్టి పూర్తిస్థాయిలో కలిసి నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు దాదాపు ఏడేళ్ల (2019లో వచ్చిన ‘పేరంబు’) తర్వాత మమ్ముట్టి తమిళ సినిమాలో నటిస్తుండటం విశేషం. ఈ సినిమాలో ధనుష్ సరసన సాయి పల్లవి మరియు శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. ‘అమరన్’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా.. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ధనుష్ స్వయంగా తన వండర్‌బార్ ఫిలింస్ బ్యానర్‌పై ఆర్‌టేక్ స్టూడియోస్‌తో కలిసి ఈ భారీ యాక్షన్ డ్రామాను నిర్మిస్తున్నాడు.




## మెగా ఫ్యాన్స్‌కు షాక్.. పెద్ది మూవీ రిలీజ్ వాయిదా

రామ్ చరణ్ హీరోగా వస్తోన్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ ఏడాది మార్చి 27న రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. కానీ తాజాగా అభిమానులకు బిగ్ షాకిచ్చింది మూవీ టీమ్. పెద్ది విడుదలను వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. పెద్ది మూవీ కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. దాదాపు నెల రోజుల పాటు ఈ సినిమాను వాయిదా వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. దీంతో మార్చిలో పెద్ది చూడాలనుకున్న మెగా ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ సినిమాకు బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

**దురంధర్-2 వల్లేనా?**

అయితే పెద్ది మూవీ వాయిదా వేయడంపై నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ సీక్వెల్ దురంధర్-2 మార్చి 19న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సారి దక్షిణాది భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పెద్దిని వాయిదా వేసి ఉంటారని నెటిజన్స్ భావిస్తున్నారు. ఇప్పటికే అడివి శేష్ నటించిన డకాయిట్ సైతం వాయిదా పడిన సంగతి తెలిసిందే.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.